



నెల్లూరు : ఎస్-2 థియేటర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

సండే మార్కెట్‌లో పొంగి ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

● నగరంలో రోడ్లపై ప్రవహించిన డ్రైనేజీ నీరు

● ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం

● పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

● రానున్న మూడు రోజుల్లోనూ వర్షాలు ?

ఈశాన్య వానలు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో గురువారం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. వేకువజాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నెల్లూరు నగరంలోని రోడ్డన్నీ జలమయమయ్యాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్డపై డ్రైనేజీ నీరు వచ్చి చేరింది. దీంతో ప్రజలు, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా నగరంలోని పంటకాలువలు చెత్తాచెదారాలతో నిండి పోవటంతో వర్షపు నీరు ముందుకు కదల్లేదు. వర్షాలు కురుస్తాయని తెలిసీ కూడా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయలేదు. దీంతో రోడ్డమీద డ్రైనేజీ నీరు పారింది. రానున్న మూడురోజుల పాటు జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

● సగటు వర్షపాతం 22 మిమీ

జిల్లాలో గురువారం సగటు వర్షపాతం 22 మి.మీ.గా నమోదైంది. జిల్లాలో అత్యధికంగా అల్లూరులో 56.4 మి.మీ, అత్యల్పంగా దుత్తలూరులో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు.. కోవూరులో 47.4, ఉలవపాడులో 46.6, పొదలకూరులో 44.2, నెల్లూరు అర్బన్‌లో 38.4, నెల్లూరు రూరల్‌లో 36.6, బోగోలులో 23.6, వెంకటాచలం 23.4, కావలిలో 22.4, కొండాపురంలో 16.2, ఆత్మకూరులో 14.8,ఉదయగిరిలో 5.8 మి.మీ వర్షపాతం నమోదు అయింది.

● ఈశాన్య రుతుపవనాల ప్రవేశం

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం నుంచి ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయి. తొలిరోజే భారీ వర్షం కురిసింది.దీంతో వ్యాపారులు, ఉద్యోగులు, కూలీలు, విద్యార్థులు, సామాన్యులు బయట తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. దీనికితోడు విద్యుత్‌శాఖ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో జనం అసహనానికి గురయ్యారు.



వర్షానికి నిర్మానుష్యంగా ఉన్న నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్

ఇలా ఎందుకు చేశారు..?

● క్యూసీ సర్టిఫికెట్‌ను దిద్దాల్సిన అవసరమేంటి... ● ప్రీక్లోజ్ అయ్యాక రివైజ్ ఎందుకు చేశారు..

● పెన్నా ప్యాకేజీ-1 వర్కుపై విజిలెన్స్ విచారణ ● 15 మంది ఇరిగేషన్ అధికారులపై ప్రశ్నల వర్షం

● త్వరలో ఎస్‌ఈ, సీఈ, పీఏవో అధికారులకు పిలుపు

నెల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పెన్నా డెల్టా ఆధునికీకరణ ప్యాకేజీ-1 పనులపై విజిలెన్స్ విచారణ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే రికార్డులన్నింటినీ పరిశీలించి అవకతవకలను గుర్తించిన విజిలెన్స్ అధికారులు.. చివరగా అందుకు బాధ్యులైన ఇరిగేషన్ అధికారులపై విచారణ మొదలుపెట్టారు. క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్(క్యూసీ)ను నిబంధనలకు విరుద్ధంగా దిద్దడం, రిక్విజిషన్ లేకపోయినా అమాంతం క్యూసీ సర్టిఫికెట్‌లో బిల్లు మొత్తాన్ని పెంచడం, ప్రభుత్వం ప్రీక్లోజ్ చేశాక అంచనాలు రివైజ్ చేయడం, నిబంధనలకు మించి బ్యాంక్ గ్యారెంటీ కమిషన్ చార్జీలు డ్రా చేసుకోవడం వంటి అనేక అంశాలను విజిలెన్స్ విభాగం లోతుగా విచారించింది. ఈ క్రమంలోనే అనేక లోటుపాట్లను గుర్తించింది. రూ.కోట్ల ప్రజాధనాన్ని దోచిపెట్టేందుకు ఇరిగేషన్ అధికారులు సహకరించారన్న నిర్ధారణకు వచ్చిన విజిలెన్స్ అధికారులు ఇప్పుడు ఇరిగేషన్ సిబ్బందిని విచారణకు పిలుస్తున్నారు. తొలుత ఇరిగేషన్ నెల్లూరు సెంట్రల్ డివిజన్ అధికారులు, సిబ్బంది నోటీసులు అందుకున్నారు. ఇద్దరు ఈఈలు, ఇద్దరు డీఈలు, ఆరుగురు ఏఈలు, ఐదుగురు అకౌంట్స్, టెక్నికల్ అధికారులకు నోటీసులు అందాయి. వీరంతా బుధవారం నెల్లూరులోని విజిలెన్స్ కార్యాలయానికి విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనేక ప్రశ్నలను విజిలెన్స్ అధికారులు వీరి ముందుంచారు. ఎవరి పాత్రకు తగ్గట్లుగా వారిని ప్రశ్నించారు. క్యూసీ సర్టిఫికెట్‌లో కరెక్షన్స్ చేస్తే మీరెలా అనుమతించారంటూ అకౌంట్స్ అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఎందుకు బిల్లును సరిగ్గా స్క్రూటినీ చేయలేదని టెక్నికల్ సిబ్బందిని అడిగినట్లు సమాచారం.

● బిల్లులెలా చేశారు...?

ఇక ఏవిధంగా ఈ బిల్లులు తయారు చేశారు..? ఎందుకు క్యూసీ సర్టిఫికెట్‌లో కరెక్షన్స్ చేయాల్సి వచ్చింది..? వర్కు ప్రీక్లోజ్ అయ్యాక ఎలా రివైజ్ చేశారు..? ఇందుకు ప్రతిపాదనలు ఎవరు పంపారు..? బీజీ కమీషన్ చార్జీల వ్యవహారమేమిటి..? వంటి అనేక ప్రశ్నలను ఇంజనీర్ల ముందుంచినట్లు తెలిసింది. విచారణకు హాజరైన వారంతా లిఖిత పూర్వకంగా వారి సమాధానాలను తెలియజేశారు. ఇంతమంది అధికారులు ఒకే రోజు విచారణకు హాజరవడం ఇరిగేషన్ శాఖలో ఇదే తొలిసారి అని చర్చించుకుంటున్నారు. అయితే త్వరలోనే మరి కొంతమందిని కూడా విజిలెన్స్ అధికారులు విచారణకు పిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. రివైజ్‌కు ప్రొపోజల్ పెట్టిన ఎస్‌ఈ కార్యాలయం, దానిని అప్రూవ్ చేసిన సీఈ కార్యాలయం అధికారులతో పాటు ఈ బిల్లులను అప్‌లోడ్ చేశాక ఆమోదించిన పేఅండ్‌అకౌంట్స్(పీఏవో) అధికారులను కూడా త్వరలోనే విచారణకు పిలవనున్నట్లు సమాచారం అందుతోంది. పెన్నా ప్యాకేజీ-1 వర్కు కాంట్రాక్టర్ వైసీపీకి చెందిన ఓ ముఖ్య నేత కావడం గమనార్హం. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిబంధనలకు విరుద్ధంగా ఈ వర్కు ప్రీక్లోజ్ జరిగిందని, రూ.కోట్లు ప్రజాధనాన్ని దోచుకునేందుకు స్కెచ్ వేశారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫిర్యాదులు అందాయి. దీంతో సీఎఫ్ఎంఎస్ నుంచి ప్యాకేజీ-1 వర్కు బిల్లులను వెనక్కు తెప్పించారు. ఆ తర్వాత ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దాదాపు ఆరు నెలల నుంచి జరుగుతున్న విజిలెన్స్ విచారణ చివరి దశకు చేరుకుంది. ఈ నెలాఖరులోపు ప్రభుత్వానికి నివేదిక అందజేసే అవకాశాలున్నట్లు విజిలెన్స్ వర్గాలు చెబుతున్నాయి.





రైతు ఉత్పత్తి సంఘాలు

బలోపేతం కావాలి

● కలెక్టర్ హిమాన్షుశుక్లా

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణను సద్వినియోగం చేసుకుంటూ, సరికొత్త ఆలోచనలతో రైతు ఉత్పత్తి సంఘాలు(ఎఫ్‌పీవోలు) బలోపేతం కావాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో గురువారం ఎఫ్‌పీవోల పురోగతిపై ఏడవ జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 108 ఎఫ్‌పీవోలు పనిచేస్తున్నాయని,వీటిని 150కి పెంచాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఈ ఎఫ్‌పీవోలు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందించేందుకు అవసరమైన జీఎస్టీ, ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా(ఫాసీ) లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ఈప్రక్రియ అంతా డిసెంబరు 15నాటికి సిద్ధం చేయాలన్నారు. రైతులకు వ్యవసాయం లాభసాటిగా మార్చడమే ఎఫ్‌పీవోల లక్ష్యం కావాలన్నారు. ఛాంపియన్ ఫార్మర్, ఎఫ్‌పీవోలను అనుసంధానం చేస్తూ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రతి ఎఫ్‌పీవో పరిధిలో రైతుల అవసరాల మేరకు వ్యవసాయ యంత్రపరికరాలు కొనుగోలు చేయాలని, అందుకు బ్యాంకులు సహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా నెదర్లాండ్స్‌లో పండ్లు, కూరగాయలు, పాలను విజయవంతంగా ఎగుమతి చేయడం, టమోటా సాగులో వినియోగిస్తున్న సాంకేతికత, ఆదాయం వంటి స్ఫూర్తివంతమైన సందేశాత్మక వీడియోలను ప్రదర్శించి, కలెక్టర్ అందరినీ చైతన్యపరిచారు. అనంతరం ఎఫ్‌పీవోలు తయారు చేసిన కొబ్బరినూనె, తినుబండారాలను ఆయన పరిశీలించారు. ఈ సమావేశంలో డీఏవో సత్యవాణి, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ జేడీలు రమేష్‌నాయక్, శాంతి, నాబార్డు డీడీఎం బాబు, వ్యవసాయాధికారులు, ఎఫ్‌పీవోల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పక్కన అధికారులు



విజయవాడలోని విద్యుత్ భవన్ ముందు ఆందోళన చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

కొనసాగుతున్న ఆందోళన

● ప్రభుత్వంతో నేడు విద్యుత్ ఉద్యోగుల చర్చలు ● సమ్మెపై ఉత్కంఠ

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్‌శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. 20కిపైగా డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో తెలుగునాడు యూనియన్ మినహా మిగతా అన్నీ యూనియన్లు నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. గతనెల 15 నుంచి దశలవారీ ఆందోళనలు చేపట్టారు. విద్యుత్ సంస్థ నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఈనెల 15 నుంచే సమ్మె నిర్వహిస్తామని ముందస్తు నోటీసులు ఇచ్చారు. అయితే రాష్ట్రంలో ప్రధాని పర్యటన ఉండడంతో సమ్మెను 17వ తేదీకి వాయిదా వేసుకున్నారు.

● దశలవారీ ఆందోళనలు

గతనెల 15,16న నల్లబ్యాడ్జీలతో నిరసన, గతనెల 17,18న సర్కిల్, సబ్‌స్టేషన్ల కార్యాలయాల ముందు బోజన విరామసమయంలో ఆందోళనలు, 20,22తేదీల్లో రిలే నిరాహారదీక్షలు, ర్యాలీలు, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమాలు నిర్వహించారు. వీటికి సానుకూల స్పందన రాకపోవడంతో తిరుపతి, విజయవాడల్లోనూ ధర్నాలు నిర్వహించి ఈనెల 15న సమ్మె చేపట్టాలని నిర్ణయించారు. రాష్ట్రంలో గురువారం ప్రధాని పర్యటన ఉండడంతో చర్చలను శుక్రవారానికి వాయిదా వేయాలని ప్రభుత్వం కోరింది. దీనికి యూనియన్ నేతలు సమ్మతించారు. ఈ క్రమంలో శుక్రవారం జరిగే చర్చలపైనే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

● డిమాండ్లు ఇవే...

విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు పూర్తిగా వైద్యం ఖర్చులు సంస్థే చెల్లించాలి. జీపీఎఫ్‌తో కూడిన పెన్షన్ నిబంధనలను 1999 ఫిబ్రవరి నుంచి 2004 ఆగస్టు వరకు నియమాకం అయిన ఉద్యోగులందరికీ వర్తింపచేయాలి. కాంట్రాక్టు లేబర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను యాజమాన్యమే నేరుగా చెల్లించాలి. దీర్ఘకాలిక సర్వీసు ఉన్నవారందరినీ సంస్థలో విలీనం చేయాలి. కారుణ్య నియామకాలు కల్పించడంలో కన్సల్టెంట్ ఇస్తున్న పే పద్ధతిని రద్దు చేయాలి. ఎనర్జీ అసిస్టెంట్లను రెగ్యులర్ జేఎల్ఎంలుగా పరిగణించి, వేతనాలు, ఇతర ప్రయోజనాలు కల్పించాలి. సర్కిల్ నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమావేశాలను పునరుద్ధరించాలి.

పీఎం కిసాన్ లబ్ధిపొందేందుకు

యూనిక్ ఐడీ ఉండాల్సిందే!

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయానికి ప్రతీ రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు.2019 ఫిబ్రవరికి ముందు రైతు పేరున పొలం ఉండాలని, ఫిబ్రవరి ఒకటి నాటికి ఉన్న రైతుల జాబితా ఆధారంగా కంప్యూటర్ ద్వారా రిజిస్టర్ అయిన వారిని మాత్రమే అర్హులని ఆమె పేర్కొన్నారు. రిజిస్టర్ అయిన రైతు చనిపోతే... అతని వారసులకు వారసత్వంగా వచ్చిన భూమిని సెల్ఫ్ రిజిస్ట్రేషన్ ద్వారా పీఎం.కిసాన్ హోం పేజీ లోదరఖాస్తు చేసుకున్న రైతులు వివిధ కారణాలతో రిజెక్ట్ చేయబడ్డారని తెలిపారు. వీరు సరైన పత్రాలతో దరఖాస్తు చేసుకునేందుకు పీ.ఎం కిసాన్ హోం పేజీలో అప్డేట్ మిస్సింగ్ ఇన్ఫర్మేషన్, ఎడిట్/ అప్డేట్ సెల్ఫ్ రిజిస్ట్రేషన్ అనే ఆప్షన్స్ ఇచ్చి ఉన్నారని ఆమె వివరించారు. కావున అనర్హులుగా ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈకేవైసీ లేని కారణంగా 927 మంది, బ్యాంకు లింకేజీ లేని కారణంగా 3376 మంది, ఫిజికల్ వెరిఫికేషన్‌కి అందుబాటులో లేకపోవడం వల్ల 3300 మంది కలిపి మొత్తం 6466 మంది పీఎం కిసాన్ పథకానికి అనర్హులుగా తేలారని తెలిపారు. వీరంతా పీ.ఎం కిసాన్ యాప్ ద్వారా లేదంటే, సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. వివరాలు సరిచేసుకున్న రైతులు 21వ విడత లబ్ధికి అర్హులవుతారని ఆమె తెలిపారు.



సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీలు



సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై కావలిలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీధర్

సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై గురువారం జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు, కరపత్రాల పంపిణీ జరిగింది. కావలి, కందుకూరు, బుచ్చి, ఉదయగిరి, కోవూరు, వెంకటాచలంలో అధికారులు ర్యాలీలు నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీఎస్టీ తగ్గింపుతో కలిగిన ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ, రవాణా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- వివరాలు లోపలి పేజీల్లో...

రాళ్లపాడు గేట్ల

ట్రయల్‌రన్

● నీటి విడుదలకు సిద్ధం చేసిన ఇరిగేషన్ అధికారులు

● గత అనుభవాలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు

లింగసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రుతు పవనాల ప్రభావంతో ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రాళ్లపాడు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల గేట్లను ప్రాజెక్టు అధికారులు సిద్ధం చేస్తున్నారు.ప్రాజెక్టు డీఈఈ ఎం.వెంకటేశ్వర్లు, సిబ్బంది గురువారం కుడి, ఎడమ కాలువల గేట్లకు గ్రీజు పెట్టించారు.అనంతరం ట్రయల్‌రన్ నిర్వహించారు.ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ వర్షాలు కురిసి ప్రాజెక్టు నిండినా, లేక సోమశిల జలాలు ప్రాజెక్టులోకి వచ్చినా, ఆయకట్టుకు గేట్ల ద్వారా నీరు విడుదల చేసేందుకు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు.ప్రస్తుతం ప్రాజెక్టులో 10 అడుగుల నీటిమట్టం ఉన్నట్టు తెలిపారు. కాగా రెండేళ్ల క్రితం ప్రాజెక్టు ఎడమ కాలువ గేటు కాలువకు నీరు విడుదల చేసే సమయంలో మధ్యలో ఇరుక్కుపోయింది. అప్పట్లో అధికారులు మెకానిక్‌ల ద్వారా గేటును బాగు చేయించి నీటిని విడుదల చేశారు.అలాగే గత ఏడాది డిసెంబరులో కుడి కాలువ గేటు కూడా కిందకు దిగిపోయి, పైకి లేవలేదు. దీంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి నిపుణులైన ఇంజనీరింగ్ అధికారులు, మెకానిక్‌లను పిలుచువచ్చి ఈ గేటును బాగు చేయించారు. అయితే ఈసారి అలాంటి పరిస్థితి రాకూడదని అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

● సోమశిలకు 11,110 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం 11,110 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో 73.611 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా దిగువకు 2,600, గేట్ల ద్వారా 7,500 ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

● కండలేరులో నీటి నిల్వ 59.910 టీఎంసీలు

రాపూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.910 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 4000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 2800 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.



రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము గేటుకు గ్రీజు పెడుతున్న ఇరిగేషన్ సిబ్బంది

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం

వెంకటాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వ విద్యాలయంలో గురువారం ఫుడ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆహార ప్రదర్శన స్టాళ్లు ఏర్పాటు చేసి, వివిధ రకాల పోషకాహార ఉత్పత్తులను ప్రదర్శించారు. ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్ ఆహార భద్రత, పోషకాహార ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ శారద ఎబేటి, డాక్టర్ పావని పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12186
వెండి కిలో ధర	రూ. 174000
వెండి ఒక గ్రాము	రూ. 183.00



పారిశుధ్యానికి ప్రాధాన్యత

ఎంపీడీవో నగేష్‌కుమారి

విడవలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 15 పంచాయతీల్లో పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వటంతో పాటు పంచాయతీల్లో ఆదాయ వనరులను పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో నగేష్ కుమారి తెలిపారు.

?. అపరిశుభ్రత నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

!. స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే ఆయా పంచాయతీలను పరిశీలించి పారిశుధ్య పనులు చేయిస్తున్నాం.

?. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

!. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంచాయతీల్లో దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ చల్లుతున్నాం. ప్రతీ పంచాయతీలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామస్థులకు ఉచిత వైద్యం అందిస్తున్నాం.

?. కొన్ని పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి.

!. నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచటానికి చర్యలు తీసుకుంటున్నాం. చెత్తని సంపద కేంద్రాల్లో వేసేలా చూడాలని కార్య దర్శులకు సూచించాం.

?. పంచాయతీల ఆబివృద్ధికి తీసుకుంటున్న చర్యలు ఏంటి?

!. పంచాయతీలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించి ఆదాయాన్ని పెంచుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

పాడి రైతుకు చేయూత!

- పశు గ్రాసానికి వంద శాతం సబ్సిడీ
- ఉపాధిహామీ ద్వారా ప్రయోజనం



రైతులు సాగు చేసిన గడ్డి

మనుబోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాడి పశువుల పోషణకు అవసరమైన పశుగ్రాసం పెంపకానికి ప్రభుత్వం పాడి రైతులకు చేయూతనిస్తోంది. పశుగ్రాసం పెంచేందుకు రైతులకు రాయితీని అందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం పెంచుకునేందుకు పాడి రైతులకు వంద శాతం సబ్సిడీని అందిస్తోంది. పశుగ్రాసం పెంచుకునేందుకు అవసరమైన విత్తనాలతో పాటు ఎరు వులు అందిస్తూ, నిధులను సమకూరుస్తోంది.

పది నుంచి 50 సెంట్ల లోపు పశుగ్రాసం సాగు చేసుకునేందుకు అనుమతి ఉంటుంది. అయితే జాబ్ కార్డులు కలిగిన రైతులు మాత్రమే ఇందుకు అర్హులు. 5ఎకరాల్లోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు ఈ రాయితీకి అర్హులవుతారు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందాలనుకునే పాడిరైతులు ముందుగా రైతుసేవాకేంద్రంలోగాని, పశువైద్యాధికారికి గాని దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తరువాత ఎంపీడీవో పర్యవేక్షణలో దరఖాస్తు చేసుకున్న రైతుల పొలాలు పరిశీలించి నీటివసతి ఉన్న వాటికే అనుమతిలిస్తారు. అనంతరం డ్వామా అధికారుల నిబంధనల మేరకు రైతులు గడ్డిసాగు చేయాల్సి ఉంటుంది.

రైతులు చేస్తున్న పొరపాట్లు ఇవే...

ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడంలో రైతులు చేస్తున్న కొన్ని పొరపాట్లు వల్లనే అర్హత పొందలేకపోతున్నారు. పశుగ్రాసం సాగు చేయాలనుకున్న రైతులు దరఖాస్తు చేసుకుని, అనుమతులు వచ్చాకే పొలాన్ని దున్నాలి. అలాకాకుండా దున్నేసి, విత్తనాలు చల్లేసి అప్పుడు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల పథకం కింద లబ్ధి పొందలేకపోతున్నారని ఏపీవో రాజమ్మ వివరించారు. ఇందులో ప్రతి పనిని ఫోటో తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అప్పుడు మాత్రమే పథకం కింద నిధులు విడుదలవుతాయని ఆమె తెలిపారు. ఇప్పటివరకు మండలంలో మనుబోలు, చెరుకుమూడి, గురివిందపూడి గ్రామాల్లో 5 యూనిట్లు ఇచ్చామన్నారు. చాలామంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే కొన్ని పొరపాట్ల వల్ల వారికి అనుమతులు లభించలేదు.

ఒక్కో యూనిట్‌కు రూ. 30వేల పైనే...

పశుగ్రాసం పథకం కింద పొలం విస్తీర్ణం ప్రకారం సబ్సిడీలు వర్తిస్తాయి. సుమారు ఒక్కో రైతుకు రూ. 30 వేల పైనే అందుతుంది. నేపియర్ రకం గడ్డి విత్తనాలు చల్లుకోవాలి. దీనిద్వారా మూడునెలల్లో గడ్డి కటింగ్‌కు వస్తుంది. ప్రతి 15 రోజులకొకసారి కోత కోయాలి. ఇలా 9 నెలల పాటు కోసిన ప్రతిసారీ మస్టర్ల ద్వారా రైతుకు ఖాతాలో నగదు జమవుతుంది. అంటే ఏడాదిపాటు ఈ పశుగ్రాసం పెంపకానికి అయ్యే మొత్తాన్ని రైతు కు రూపాయి ఖర్చులేకుండా వంద శాతం సబ్సిడీ రూపంలో అందిస్తారు.

పాడి రైతులకు వరం



పశుగ్రాసం ద్వారా పాడిపశువులకు తగిన పౌష్టికాహారం సులభంగా లభిస్తుంది. పాల ఉత్పత్తి పెరిగి రైతుల ఆర్థిక స్థిరత్వానికి దోహదం చేస్తుంది. పాడి రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకం నిజంగా వారికి ఒక వరం.

- గురవారెడ్డి, ఏడీ, మనుబోలు

పట్టా, శివాయి, కౌలుదారులకు యూరియా పంపిణీ చేస్తాం



రైతుకు యూరియా బస్తాను అందజేస్తున్న పురంధర్‌రెడ్డి

విడవలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టా, శివాయి. కౌలు రైతులకు యూరియాని అందజేస్తామని విడవలూరు పీఏసీఎస్ చైర్ పర్సన్ పొన్నలూరు పురందర్ రెడ్డి తెలిపారు. విడవలూరులోని పీఏసీ ఎస్‌లో గురువారం రైతులకు యూరియాని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరియా పంపిణీలో వస్తున్న ఆరోపణలను రైతులు నమ్మరాదన్నారు. సొసైటీకి 1090 యూరియా బస్తాలు వచ్చాయని వీటిని రైతులకు ఎకరాకు 3 కట్టల చొప్పున అందజేస్తామన్నారు. రైతులు సొసైటీకి బకాయిలు చెల్లించి, అభివృద్ధికి సహకరించాలన్నారు. సీఈవో దద్దేలు రవి పాల్గొన్నారు.

బాలికల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఇందుకూరుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగదేవిపేట గ్రామం ఆదెమ్మ సత్రం ఎస్టీ కాలనీలో గురువారం వైద్యాధికారులు డాక్టర్ బ్రహ్మేశ్వర నాయుడు, డాక్టర్ కిషోర్‌కుమార్ సూచనలతో ఆడపిల్లల హక్కుల రక్షణ - ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీహెచ్ సుధాకర్‌రావు మాట్లాడుతూ ఆడపిల్ల కుటుంబానికి వెలుగునిచ్చే తల్లి, సోదరి, భార్యగా వివిధ రకాల పాత్రలు పోషిస్తుందన్నారు. కుటుంబాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో కీలకపాత్ర వహిస్తుందనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఆడపిల్లలను గౌరవించడం అంటే మన సంస్కృతిని గౌరవించడమేనన్నారు. ఆడపిల్ల లకు సమాన హక్కులు, సమాన అవకాశాలు రాజ్యాంగం ద్వారా సంక్రమించాయని, వీటిపై అవగాహన కలిగించాలన్నారు. లింగ, వివక్ష వల్ల అధిక శాతం మంది బాలికలు ప్రాథమిక విద్యకు కూడా దూరం అవుతున్నారన్నారు. బాల్య వివాహాలు, గృహ హింస వంటి ఘటనలను నిరోధించేందుకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీ డీఎస్ సూపర్‌వైజర్ సుబ్బ రత్నమ్మ, పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ రమ, సీహెచ్‌ఓ నందిని, హెల్త్ అసిస్టెంట్లు మాధవ, సుధాకర్, సచివాలయ హెల్త్ సెక్రటరీ ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వాలంటీర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు చెల్లించాలి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు జూలై, ఆగస్టు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున డిమాండ్ చేశారు. గురువారం బుచ్చిరెడ్డిపాళెంలోని మండల విద్యాశాఖ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన కార్మికులతో నిరసన వ్యక్తం చేసి ఎంఈఓ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ఖాతాలకు జమైనట్లు మెసేజ్‌లు పంపారు తప్ప వారి ఖాతాలకు నగదు జమ కాలేదన్నారు. సివిల్ సప్లైస్ అధికారులు పిల్లలకు వండిపెట్టే బియ్యం నేరుగా పాఠశాలలకు పంపించాలన్నారు. తాము బియ్యం తెచ్చుకునేందుకు 200రూపాలయలు రవాణా చార్జీలు అవుతున్నాయన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తమకు రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అన్నపూర్ణమ్మ, గాయత్రి, సునీత, దిల్షాద్, సుజాత, విజయ, ఆయాలు రమణమ్మ, ఆశ్రమం తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

రాపూరు, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): రాపూరు పట్టణంలోని మద్దెలమడుగు సెంటర్లో వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు, అయ్యప్ప స్వామి ఆలయంలో, గురువారం నుంచి 41 రోజులు పాటు సాగే నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మాలధారణ స్వాములకు 41 రోజుల పాటు నిత్యాన్నదానం నిర్వహిస్తామన్నారు. కఠిన నియమాల్లో భిక్షకు అధిక ప్రాధాన్యత ఉందని, దాతల సహకారంతో ప్రతి రోజూ సుమారు 300 మందికి పైగా భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటిరోజు ఈ కార్యక్రమానికి ఉభయ దాతలుగా రాపూర్ ఏఎస్ఐ వెంకటేశ్వరరావు దంపతులు వ్యవహరించారు.

జీఎస్టీతో పేదల జీవన ప్రమాణాలు మెరుగు

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కొనుగోలుదారులకు బైకు తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం బుచ్చిలోని ఓ కళ్యాణమండపంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో 28 శాతం వున్న జీఎస్టీ 18 శాతానికి తగ్గడంతో ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్టు రంగానికి ఎంతో మేలు జరిగిందన్నారు. అనంతరం జీఎస్టీ తగ్గింపు ధరలతో బైకులు కొనుగోలు చేసినవారికి తాళాలు అందజేసి అభినందించారు. జిల్లా రవాణాశాఖ అధికారి కార్తీక్, బుచ్చి మున్సి పల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వవ్వేరు, బుచ్చి బ్యాంకుల చైర్మన్లు దొడ్ల విజయలక్ష్మి, ఏటూరి శివరామకృష్ణారెడ్డి, టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్ చార్జ్ రామానాయుడు, వైస్ చైర్మన్ పఠాన్ నస్రీన్ ఖాన్, చప్పిడి శ్రీనివాసులురెడ్డి, కాసా శ్రీనివాసులు, రామిశెట్టి కళ్యాణ్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొడవలూరు : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కొడవలూరు గుండాలమ్మపాలెం సొసైటీని ఆమె గురువారం ప్రారంభించారు. నియోజకవర్గంలో మారుమూల గ్రామాలను సైతం పట్టణాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లునాయుడు, మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, నాయకులు బద్వేల్ వినీల్‌రెడ్డి, పల్లంరెడ్డి సాయిమోహన్‌రెడ్డి, కోవూరు వెంకీ, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మనుబోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళికి టపాసులు విక్రయించే వ్యాపారస్తులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రమాదేవి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం టపాసుల వ్యాపారస్తులతో సమావేశమయ్యారు. నిబంధనల మేరకు కొనుగోలుదారులకు ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలకు తావు లేకుండా దుకాణాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, ఆర్ఐ అరుణ్‌బాబు పాల్గొన్నారు.

1నుంచి ఈకేవైసీ ఉన్నవారికే పని

వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఈకేవైసీ చేసిన జాబ్‌కార్డులకు మాత్రమే పని కల్పిస్తామని ఏపీవో రాజమ్మ తెలిపారు. గురువారం ఆమె జట్లకొండూరులో కూలీలకు ఈకేవైసీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్ కార్డులు కలిగిన ప్రతి కూలీ ఈకేవైసీ చేయించాలన్నారు. జాబ్ కార్డులు లేకపోతే చాలా సంక్షేమ పథకాలు రావన్నారు.

నేడు కామాక్షితాయి ఆలయ భూములకు వేలం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయానికి చెందిన లీజు కాలపరిమితి తీరిన భూములకు శుక్రవారం పలు ప్రాంతాల్లో బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ శ్రీనివాసులురెడ్డి, కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం చిట్టేపల్లిగ్రామం, మధ్యాహ్నం దామరమడుగు, పాటూరు, బసవాయపాళెం గ్రామాలలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం జొన్నవాడ, పెనుబల్లి గ్రామాల్లో మధ్యాహ్నం పంచేడు, 21న ఉదయం పూడిపర్తి, మధ్యాహ్నం పున్నూరులో వేలంపాటలు జరుగుతాయన్నారు.

గురుకుల పాఠశాలలో చిత్రలేఖన పోటీలు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

వెంకటాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే (మత్స్యకారుల) బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం చిత్రలేఖన, లఘు నాటికల పోటీలు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ముఖ్య అతిథిగా జిల్లా న్యాయసేవా ధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి విచ్చేసి పోటీలను ఆమె వీక్షించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది నాగ అపర్ణ, సుజాత, మదన్ మిశ్రా, పెంచల నరసయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పద్య రత్నాలను అభినందించిన ఎంఈవో



విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈవో దిలీప్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో 'లవ్ పీపుల్ ఫౌండేషన్' నిర్వహించిన జాతీయస్థాయి వేమన పద్య పోటీలలో 13, 16 స్థానాలు పొందిన పీ పావని, ఎం లక్ష్మీప్రసన్నలను ఎం ఈఓ దిలీప్‌కుమార్ గురువారం అభినందించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన పద్యాలలో విలువలు, జీవన నైపుణ్యాలు, లోకం పోకడ వుంటాయన్నారు. సామాన్యులకు అర్థమయ్యే రీతిలో సాహిత్యాన్ని పరిచయం చేసిన వేమ న అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలి చిపోయారన్నారు. తెలుగు సాహిత్యాన్ని, ఆ మధురిమలను అందరికీ పంచుతూ విశేష కృషి చేస్తున్న గండికోట సుధీర్‌కుమార్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత, తెలుగు ఉపాధ్యాయులు రమణమ్మ, రాధిక, విద్య తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు ఫలాలు అందరికీ అందాలి

- పేద, మధ్య తరగతి ప్రజలకు వరం
- ఎమ్మెల్యే సోమిరెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపు ఫలాలు ప్రతీ కుటుంబానికీ అందేలా ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలి పారు. వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద గురువారం రవా ణా శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజ లకు అవగాహన కల్పిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లా డుతూ ఒక్కో వాహనం ధరలో రూ.10 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు ధర తగ్గుతోందని, ప్రజలు జీఎస్టీపై అవగాహన పెంచుకోవాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు సైతం తగ్గాయని, గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు వరంలా జీఎస్టీ సేవింగ్స్ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్టీ సంక్షేమ నిధితో కార్యకర్త కుటుంబానికి చేయూత

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పార్టీ సంక్షేమ నిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఇటీవల కృష్ణపట్నం పోర్టు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని తాటిపర్తిపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త గుమ్మా వెంకటరమణయ్య మృతి చెందారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి కృషితో ఆ కుటుంబానికి సభ్యత్వ ఇన్సూరెన్స్ స్కీమ్ ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. దీంతో గురువారం నెల్లూరులోని వేదాయపాలెం వద్ద ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో సోమిరెడ్డిని బాధిత కుటుంబ సభ్యులు కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాటిపర్తిపాలెం టీడీపీ నేత నిక్కుదల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడించారు. వెంకటాచలం సమీపంలోని టోల్ ప్లాజా వద్ద గురువారం స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆది శంకర కళాశాలలో రూ.22 కోట్లతో ఎక్విప్మెంట్ ఏర్పాటు చేయగా 9500 మంది శిక్షణ పొందారన్నారు. 2 ఎకరాల్లో ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి, రూ.2.29 కోట్లతో భవనాలు నిర్మించి రూ.43 లక్షలతో పరికరాలు తెప్పిస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, టీడీపీ మండలా ధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, చవటపాలెం సొసైటీ చైర్మన్ రాపూరి రాధాకృష్ణమ నాయుడు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నల్లా నాగార్జున రెడ్డి, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బొబ్బేపల్లి సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ఉరి వేసుకుని విద్యార్థి ఆత్మహత్య

- ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఘటన

కొడవలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొడవలూరు పంచాయతీ పరిధిలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లమో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు కడప జిల్లా పోరుమామిళ్ల గ్రామానికి చెందిన ఉదయ్ (17) ప్రైవేటు కళాశాలలో డిప్లమో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం కళాశాల సిబ్బంది తాళం తీయడంతో గదిలో విద్యార్థి ఉరివేసుకుని ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సురేంద్రబాబు, ఎస్ఐ కోటిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. ఇద్యార్థి మృతికి కారణాలపై విచారణ చేస్తామని సీఐ సురేంద్రబాబు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి పంచాయతీ అన్నంపల్లి గ్రామానికి చెందిన ఎగిటీల శ్రీనివాసులు తన కుమారుడు వెంకటయోగేష్ కనిపించడంలేదని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటయోగేష్ ఉదయగిరిలోని మేకపాటి వెంకురెడ్డి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన వెంకటయోగేష్ రాత్రికి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించడంతోపాటు బంధువులు, స్నేహితులను విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిస్సింగ్ కేసులపై తక్షణం స్పందించండి : ఎస్పీ



చిన్నబజారు పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలు తప్పిపోయిన కేసులలో తక్షణమే స్పందించి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాలని, అసలత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల హెచ్చరించారు. గురువారం ఆమె నగరంలోని చిన్నబజారు పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిధి, క్రైం చార్ట్, స్టేషన్ పరిధిలో ఉన్న నేర, శాంతిభద్రతల పరిస్థితులను పరిశీలించారు. గత మూడేళ్ల కాలంలో క్రైమ్ ఏవిధంగా ఉందో రికార్డులను తనిఖీచేసి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు చట్టాన్ని సమర్థవంతంగా అమలు పరచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్‌లు, సస్పెక్ట్‌లు, పాత నేరస్థులపై నిఘా పెంచాలని, క్రిమినల్ చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ వ్యవస్థను ముమ్మరం చేయాలని, చైన్ స్నాచింగ్ నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి శుక్రవారం మెన్ గ్రీవెన్స్ ఉంటుందని, అందరూ వినియోగించుకోవాలని తెలిపారు.

టపాసుల దుకాణాల్లో తనిఖీలు



టపాసుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా గురువారం నగరంలోని పొర్లుకట్ట ప్రాంతంలో పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపకశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో కంపెనీ టపాసులతో పాటు నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన లోకల్ మేడ్ టపాసులను గుర్తించి స్వాధీనం చేసుకు న్నారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా టపాసులను నిల్వ ఉంచిన, అమ్మకాలు జరిపినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం దుకాణాల్లో...



మద్యం దుకాణంలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న ఎక్సైజ్ డీసీపీ శంకరయ్య

కావలి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యంను గుర్తించేందుకు క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి, ఆ తర్వాతనే మద్యం విక్రయాలు జరపాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం శంకరయ్య, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఏ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. గురువారం కావలి ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌ను వారు సందర్శించారు. అనంతరం పట్టణంలోని పలు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం సీసాలపై ఉన్న క్యూఆర్‌కోడ్‌లను స్కాన్ చేసి, అవి సక్రమమా? కాదా? తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించి మద్యం దుకాణదారులకు పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకే మద్యం అమ్మకాలు సాగించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావలి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుంకర శ్రీనివాసులు తనిఖీల్లో పాల్గొన్నారు.

రైల్వే క్వార్టర్స్‌లో పట్టపగలే చోరీ

- బంగారు నగల అపహరణ

కావలి రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని వడ్డిపాలెం రైల్వే క్వార్టర్స్‌లో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. ఒకటవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ట్రాక్ ఉమెన్ గా విధులు నిర్వహిస్తున్న గోళ్ల శైలజ మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి అన్నగారిపాలెం పంచాయతీలోని పూలదొరువులో బంధువుల ఇంటికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి సిమెంట్ కిటికీ పగలగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు.. బీరువా తాళం పగలగొట్టి 12 గ్రాముల బంగారు నగలు దొంగిలించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటవ పట్టణ పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 550

తమిళనాడు బోట్ల సమస్య పరిష్కరించాలి

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తమిళనాడు బోట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మత్స్యకార సంక్షేమ సమితి నాయకులు చెంచుగారి రమేష్, కోటంగారి లక్ష్మీనారాయణ, వికాస్ కోరారు. గురువారం వారు ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ 3 నెలలుగా తమిళనాడులోని కరైకల్, కడలూరు బోట్ల అక్రమ చేపల వేట కారణంగా జిల్లాలోని 118 గ్రామాల కాపులు ఆర్థికంగా నష్టాలకు గురవుతున్నారని, తమిళ జాలర్లు కత్తులు, కారంపొడి వంటి ఆయుధాలతో తమ జాలర్లపైన దాడి చేయడమే కాక మరబోట్ల ద్వారా తమ బోట్లను ధ్వంసం చేస్తున్నారని వాపోయారు. గత 10 ఏళ్లుగా ఈ సమస్యలు ఎదురుకొంటున్నామన్నారు. ఈ దారుణాలపై పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మత్స్యశాఖ అధికారులు ఇది తమశాఖ పరిధి కాదని చెప్తారన్నారు. తీర ప్రాంతంకు వచ్చి చేపలు పడుతున్న తమిళ జాలర్లను పట్టుకుని అధికారులకు అప్పగించినా వదిలివేశారని వాపోయారు. కాపుల ఆలోచనల మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో సమావేశం నిర్వహించి తమిళ జాలర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.



నెల్లూరు శ్రీరామమూర్తి

విలువలకు నిలువుటద్దం

నెల్లూరు శ్రీరామమూర్తి

- జర్నలిజం చరిత్రలో ఆయనది సుస్థిర స్థానం
- చారిత్రక జమీన్‌రైతు జీవప్రదాత
- నేడు ఆయన శత జయంతి

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జర్నలిజంలో నైతిక విలువలు, జవాబుదారీతనానికి నిలువుటద్దం జమీన్‌రైతు జీవప్రదాత నెల్లూరు శ్రీరామమూర్తి. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆయన 50 ఏళ్లపాటు జమీన్‌రైతు పత్రిక కోసమే కృషి చేశారు. నెల్లూరు యాసకు, తెలుగు భాషా విశిష్టతకు ఎనలేని సేవలు చేశారు. వాడుక భాషలోనే వార్తలకు శ్రీకారం చుట్టి, పత్రికా ప్రపంచానికి కరదీపిక అయ్యారు. ప్రపంచ చిత్రపటంలో నెల్లూరు అంటే గుర్తుకు వచ్చేది జమీన్‌రైతు వారపత్రికే. అది 1930లో ప్రారంభమై నేటికీ అదే విలువలతో కొనసాగుతున్నది. తెలుగు నేలలో (రాష్ట్రాల్లో) ఎన్నో పత్రికలు పుట్టాయి. గిట్టాయి కానీ.. జమీన్‌రైతు 96 ఏళ్లుగా ప్రతీవారం వెలువడుతోంది. జమీన్‌రైతు పత్రికకు మూలపురుషుడు నెల్లూరు వెంకట్రామనాయుడు అయితే, ఆ పత్రిక జీవప్రదాత నెల్లూరు శ్రీరామమూర్తి. పత్రికా రచన కోసం ప్రత్యేకంగా ఆయన చదువులు ఏమీ చదవలేదు. కొమ్ములు తిరిగిన పత్రికా రచయితలు, ఆయన వద్ద పాఠాలు నేర్చుకున్నారు. ఎంతో మంది జర్నలిస్టులను శ్రీరామమూర్తి తీర్చిదిద్దారు. చిన్న చిన్న పదాలు, నెల్లూరు నుడికారం, సామాన్యుల వాడుక భాషల్లో రాయడం ఆయనకు ఆయనేసాటి. జైఆంధ్రా ఉద్యమంలో జమీన్ రైతుపై ఒత్తిడి తీవ్ర స్థాయిలో ఉన్న సమయంలో రాష్ట్ర విభజన వల్ల ప్రజలకు నష్టం జరుగుతుందని ఆయన తన అభిప్రాయం రాశారు. దానిపై ఉద్యమకారులు చేసిన దాడులకు, నష్టాలకు వెరవకుండానే తన రచనలు కొనసాగించారు. అలాగే జిల్లాలో సంచలనం సృష్టించిన తాళ్లపాలెం, మద్దూరుపాడు హత్యలపై రాసిన వార్తలకు నక్సలైట్లు ఆగ్రహానికి గురైనా ఆయన వెరవలేదు. ఆయనను హతమార్చాలని నక్సలైట్లు ఆయన ఇంటిపై దాడి చేశారు. ఆనాటి ఎస్పీ విజయరామారావు స్వయంగా రామమూర్తి ఇంటి ముందు కాపాలా కాసి ఆయన్ను ప్రాణహాని నుంచి తప్పించారు. సిద్ధాంతాలు వేరైనా పార్టీ నేతలతో కూడా ఆయన స్నేహబంధాలు కొనసాగించారు. పరిశోధనాత్మక జర్నలిజానికి శ్రీరామమూర్తి ఆనాడే శ్రీకారం చుట్టారు. 50ఏళ్ల క్రితం జరిగిన కళారాణి చంద్రికా జంట హత్య కేసుల వార్తా కథనాలు ప్రపంచ యావత్తు గుర్తింపుపొందాయి. అలాగే ఎన్టీఆర్ రాజకీయాల్లో వస్తున్నారని జమీన్‌రైతు ముందుగానే ప్రచురించింది. దీనిపై ఎన్టీఆర్ ఓ సినిమా షూటింగ్ నుంచి శ్రీరామమూర్తికి ఫోన్ చేసి ఆవులించకుండానే పేగులు లెక్కపెట్టి విద్య నేర్చుకున్నారు బ్రదర్.. అంటూ అని అభినందించారు. శ్రీరామమూర్తికి రైతులు అన్నా, వ్యవసాయమన్నా ఎక్కువ మక్కువ. వారి సమస్యలపై జమీన్ రైతు పత్రిక ద్వారా ఆయన ఎన్నో పోరాటాలు చేశారు. ఆనాటి జాతీయ ప్రాంతీయ రైతు నాయకులు కీర్తిశేషులు ఎన్జీరంగా, గౌతు లచ్చన్న, పెండేకంటి వెంకటసుబ్బయ్య, పెద్దరెడ్డి తిమ్మారెడ్డి వంటి నాయకులతో దగ్గరి సంబంధాలు ఉండేవి. ఎన్జీరంగా చెన్నైకి వెళ్లేటప్పుడు ప్రతీసారి నెల్లూరు రైల్వేస్టేషన్‌లో ఆయన్ను కలిసి వెళ్లేవారు. అమెరికన్ రాయబారి కార్యాలయంలో సమాచార అధికారిగా పనిచేస్తున్న బీఎస్ఆర్.కృష్ణ శ్రీరామమూర్తిని తెలుగు విభాగాధిపతిగా పనిచేయమని కోరినా, ఆయన అంగీకరించలేదు. అలాగే ఆయన ప్రభుత్వ అవార్డులు అన్నా విముఖత చూపేవారు తొలి ప్రపంచ తెలుగు మహాసభల్లో అప్పటి సీఎం జలగం వెంగళరావు సన్మానం చేస్తామని ఆహ్వానం పంపినా ఆయన స్వీకరించలేదు. అప్పటి విద్యాశాఖ మంత్రి మండలి కృష్ణారావు సీఎం వెంగళరావును వెంటబెట్టుకు వచ్చి నెల్లూరు డీకే మహిళా కళాశాలలో సభ ఏర్పాటు చేసి ఆ సభలో శ్రీరామమూర్తిని సన్మానించారు. పాత్రికేయ దిగ్గజంగా గుర్తింపు పొందిన నెల్లూరు శ్రీరామమూర్తి 1925 అక్టోబరు 17న జన్మించారు. 1993 జూలై 19న స్వర్గస్తులయ్యారు.

నేడు శత జయంతి

నెల్లూరు శ్రీరామమూర్తి శత జయంతి వేడుకలను శుక్రవారం రాత్రి నగరంలోని హోటల్ మినర్వాలో నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పాల్గొననున్నారు.

అనుమతించిన చోటే

దుకాణాలు ఏర్పాటు చేయాలి

- జీఎస్టీ చెల్లించిన వారికే డిప్‌లో అవకాశం
- లైసెన్స్ ఉన్న వ్యాపారులు దరఖాస్తు చేసుకోవాలి
- ఆంధ్రజ్యోతితో నెల్లూరు ఆర్డీవో అనూష



నెల్లూరు ఆర్డీవో అనూష

నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలో టపాకాయల దుకాణాలను ప్రభుత్వం కేటాయించిన మైదానాల్లోనే ఏర్పాటు చేయాలని నెల్లూరు ఆర్డీవో స్పష్టం చేశారు. దీపావళికి టపాసుల దుకాణాలను కేటాయింపు విషయాలపై గురువారం ఆంధ్రజ్యోతితో ఆమె మాట్లాడారు. నగరంలో ఎక్కడపడితే అక్కడ, రోడ్ల పక్కన దుకాణాల ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు లేవు. ఎవరైనా ఏర్పాటు చేస్తే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకొంటాము. శుక్రవారం లోపల మైదానాలను గుర్తించి దుకాణాలను ఏర్పాటు చేస్తాం. లైసెన్సు ఉన్న వ్యాపారస్థులు వెంటనే జీఎస్టీ చెల్లించి నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో డిప్‌కు పేర్లను నమోదు చేసుకోవాలి. డిప్ విషయంలో ఎలాంటి సిఫార్సు లేఖలు అను మతించం. జీఎస్టీ చెల్లింపుల కోసం ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశాం. తప్పనిసరిగా శనివారం లోపల ప్రతీ ఒక్క లైసెన్సు దారుడు జీఎస్టీ చెల్లించాలి. లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తాం. డిప్ విధానం పారదర్శకంగా నిర్వహిస్తాం. ప్రతీ ఒక్క వ్యాపా రస్తుడు లైసెన్సుతో పాటు అగ్నిమాపకశాఖ, పోలీసు ఎన్‌వోసీ తప్పనిసరిగా ఉండాలి. అలాంటి వారికి దుకాణాల కేటాయిస్తాం. దుకాణాల కేటాయింపులపై వస్తున్న పుకార్లను నమ్మవద్దు.

విద్యారంగ సమస్యలపై బస్సు యాత్ర



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు నిర్వహించే బస్సు జాతను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.మస్తాన్‌షరీఫ్ కోరారు. నగరంలోని రామకోటయ్యనగర్ జిల్లా కార్యాలయంలో యాత్రకు సంబంధించిన గోడపత్రికను గురువారం విడుదల చేసి మాట్లాడారు. విద్యారంగంలో ఎన్నో సమస్యలు నెలకొన్నా ప్రభుత్వం వాటిని పరిష్కరించడం లేదన్నారు. మెడికల్ కళాశాలల్లో పీపీపీ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టడంతో పాటు మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి పునః ప్రారంభించాలన్నారు. పేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే జీవో నెం 77ను రద్దు చేయాలని, విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతి మండలంలో జూనియర్ కళాశాలను, నియోజకవర్గంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ జరిగే బస్సు జాతాను విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 3వతేదీన యాత్ర జిల్లాలోకి, నగరంలోకి చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు శివంవర్మ, సోహిల్, అబ్దుల్ వికాస్, తదితరులు పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో 'స్వచ్ఛత'



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

నెల్లూరు(విద్య), అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమణారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛతపై విద్యార్థినులకు అవగాహన కల్పించేందుకు క్రమం తప్పకుండా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ఆవరణలో 120 మొక్కలు నాటించి సంరక్షిస్తున్నామన్నారు. ప్రతి తరగతి గదిలో చెత్తకుండీలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు పరిశుభ్రత పాటించడంతో పాటు ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని మాత్రమే తీసుకునేలా వారిని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర కార్యాలయం ప్రతినిధి హరికృష్ణ, ఎన్‌వైకే కో ఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ప్రసన్న, భారతి, శివయ్య, తులసి, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్ కమిషనర్‌ను కలిసిన జనసేన నాయకులు



కమిషనర్ కృష్ణతేజను కలిసిన జనసేన నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయ తీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిష నర్ మైలవరపు కృష్ణతేజను జనసేన పార్టీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆ పార్టీ నెల్లూరు నగర అధ్య క్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఆధ్వర్యంలో తాడేపల్లిలోని కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ కృష్ణతేజ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్, జిల్లా ఉపాధ్య క్షుడు, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తీగల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆక్రమిస్తే కూల్చేస్తాం..!

- పొదలకూరు రోడ్డులో ఆక్రమణల తొలగింపు



కొత్తూరు వద్ద రోడ్డు ఆక్రమించి, కట్టిన నిర్మాణాన్ని కూల్చేస్తున్న ఎక్స్‌కవేటర్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఖాళీజాగా, కాలువ కరకట్టలు కనిపిస్తే చాలు ఆక్రమించేసి నిర్మాణాలు చేపడుతున్నారు. కబ్జాదారులు ఈ పంథాను అనుసరిస్తుండగా కార్పొరేషన్ అధికారులు వాటిని కూల్చుకుంటుపోతున్నారు. ఇందులో భాగంగా గురువారం 30, 31 డివిజన్లలోని పొదలకూరురోడ్డు, కొత్తూరు ప్రాంతాలలో రోడ్డు ఆక్రమిత స్థలాల్లో నిర్మించిన అనేక కట్టడాలను అధికారులు ఎక్స్‌కవేటర్‌తో కూల్చేశారు. ఇటు సిటీ నియోకవర్గ పరిధిలోని సుబేదార్‌పేట, నక్కలవాళ్ల కూడలి ప్రాంతాలలో రోడ్లను ఆక్రమించి నిర్మించిన కట్టడాలు, బొంకులు, టెంట్లును నేలమట్టం చేశారు. చిల్డ్రన్స్ పార్కు ఎదురుగా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాన్ని తీసేశారు.

వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపండి

- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేకి సీపీఎం నేతల వినతి



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు మార్జిన్ వ్యాపారులకు ప్రత్యామ్యాయం చూపాలని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో సీపీఎం నేతలు కొండా ప్రసాద్, నాగేశ్వరరావు, కండె కోటేశ్వరరావు వినతిపత్రం అందించారు. కొత్తూరులోని తెలుగుగంగ కార్యాలయం నుంచి కేంద్రీయ విద్యాలయం స్కూల్ వరకు రోడ్డుకు ఇరువైపులా గత 30 ఏళ్లుగా చిన్నచిన్న అంగళ్లు పెట్టుకుని అనేక మంది నిరుపేదలు వ్యాపారం చేసుకుంటున్నారని చెప్పారు. అయితే మున్సిపల్ కమిషనర్ రోడ్డుకు ఇబ్బందిగా ఉందని వెంటనే ఇక్కడ అంగళ్లను ఖాళీ చెయ్యమని ఆదేశించారన్నారు. ఈ నేపధ్యంలో అంగళ్లను అధికారులు ఇప్పటికే కొన్నింటిని ఖాళీ చేయించారన్నారు. ఇలాంటి స్థితిలో చిరు వ్యాపారులు జీవనోపాధిని కోల్పోతున్నారని, వారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు హమీద్, రోడ్డు మార్జిన్ వ్యాపారులు పాల్గొన్నారు.

న్యూ విక్టోరిస్ కారు విడుదల




న్యూ విక్టోరిస్ కారును విడుదల చేస్తున్న కొండా నిరంజన్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : భార్గవి ఆటోమొబైల్ షోరూమ్‌లో అత్యాధునిక ఫీచర్లు కలిగిన న్యూ విక్టోరిస్ కారు విడుదలైంది. ఈ సందర్భగా భార్గవి ఆటో మొబైల్ ఎండీ కొండా నిరంజన్‌రెడ్డి ఈ కారులోని ఫీచర్లు వివరించారు. డ్రైవింగ్ చేసేందుకు ఎంతో అనువుగా ఉండడమే కాక పూర్తి భద్రతనిచ్చే ఫీచర్లు ఉన్నాయన్నారు. ఇందులో 6 ఎయిర్ బ్యాగ్స్, షిఫ్ట్ స్టార్ట్ బటన్, ఇంజన్ డ్రాగ్ కంట్రోలర్, షిఫ్ట్‌టెలె స్కో పిక్ స్టీరింగ్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. ఈ కారుకు భారత్ ఎస్పీ, గ్లోబల్ ఎస్‌సీఏపీ 5స్టార్ రేటింగ్‌లు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భార్గవి ఆటో మొబైల్స్ చైర్మన్ కొండా బలరామిరెడ్డి, సీజీఎం రవికుమార్, కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పొగ తాగితే రూ.200 కట్టాల్సిందే!

- రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశం
- నిఘా పెట్టిన యంత్రాంగం
- మీడియాలో ఫొటోలొచ్చినా వెతికిమరీ ఫైన్



పొగ తాగరాదని చిల్డ్రన్స్ పార్కు గోడపై అంటించిన హెచ్చరిక పోస్టర్

నెల్లూరురూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఇకపై నెల్లూరులో విచ్చల విడిగా, ఎక్కడపడితే అక్కడ పొగ తాగే వారికి జరిమానా తప్పదు. బహిరంగ ప్రాంతాలు, పార్కులు, జన సముదాయాలు, ఫంక్షన్లు, మీటింగ్‌లు, సమావేశాలు ఇలా పదిమంది ఒక్క దగ్గర ఉండే ప్రదేశం ఏదైనా సరే అక్కడ సిగరెట్, బీడీ, చుట్టా ఇలా పొగాకు ఉత్పత్తులను తాగుతూ, పొగ వదిలితే వారు రూ.200 జరిమాన కట్టాల్సిందే. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ తరహా చట్టం 2002లోనే అప్పటి ప్రభుత్వం రూపొందించినప్పటికీ తాజాగా కొన్ని మార్గదర్శకాలకు మెరుగులు దిద్దిన కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణ రీత్యా ఈ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఆదేశాలను అందుకున్న కార్పొరేషన్ ఆరోగ్య విభాగం బహిరంగ ప్రాంతాలతో పాటు పార్కుల్లోనూ హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. నగరంలోని 166 సచివాలయాల పరిధిలోని ఉద్యోగులు, పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలతో పాటు మేస్త్రీలకు బాధ్యతలను అప్పగించారు. ఎవరైనా పొగ తాగుతూ బహిరంగ ప్రదేశాల్లో కనిపించినా, పార్కుల్లో తటస్థపడినా, పొగతాగుతూ మీడియాల్లోనూ ప్రచురితమైనా వారిని గుర్తించి జరిమాన వేసేల చర్యలకు శ్రీకారం చుట్టారు.

- రాంనగర్‌లో డెంగ్యూ గుర్తింపు

వాతావరణ మార్పులతో ఏర్పడిన సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై కార్పొరేషన్ ఆరోగ్య విభాగం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఈ నేపథ్యంలో ఇంటింటా సర్వేలో భాగంగా రాంనగర్‌లో ఒక డెంగ్యూ కేసును గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన యంత్రాంగం ఆ ఇంటి పరిసరాల్లో వ్యాధి వ్యాప్తి నివారణ చర్యలు మొదలుపెట్టారు. కాగా ప్రభుత్వ మెడికల్ కళాశాల సమీపంలోని జేవీఆర్ కాలనీలో జ్వరపీడితులు ఉన్నట్లు ఈ సర్వేలోనే తేలింది. దీంతో నివారణ చర్యల్లోకి మున్సిపల్, ఆరోగ్య శాఖలు నిమగ్నమయ్యాయి. ఇటీవల విజయవాడ, గుంటూరు ప్రాంతాలలో విషజ్వరాలు ప్రబలడంతో అప్రమత్తమైన సర్కారు నుంచి ఆదేశాలతో నెల్లూరులోనూ పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు.

- తాగునీటి, డ్రైనేజీ పైపుల పైనా ఆరా...

నగరంలోని ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీటి పైపులు, ఇళ్ల నుంచి బయటకు మురుగును తీసుకెళ్తున్న డ్రైనేజీ పైపులు ఎక్కడైన దగ్గరగా ఉన్నాయా..? పైన, కింద ఉన్నాయా..? అన్నది నగర వ్యాప్తంగా ఆరా తీస్తున్నారు. నెల్లూరులోని 21 అర్బన్ ఆరోగ్య కేంద్రాలు, 166 సచివాలయాల ద్వారా సిబ్బందిని రంగంలోకి దింపిన కార్పొరేషన్ ఆరోగ్య విభాగం అధికారులు ఈ తరహా సర్వే నిర్వహిస్తున్నారు. పై వ్యాధులకు ప్రాథమిక వేదికైన లార్వా సర్వేను ఇంటింటికి వెళ్లి నిర్వహించాలని సూచించారు. ఈశాన్య రుతుపవనాలతో ఏర్పడిన వర్షాల కారణంగా వాతావరణంలో మార్పులు మొదలైన ఈ సమయంలో సీజనల్ వ్యాధులు తలెత్తే అవకాశం ఉందని, ఈ సమయంలోనే అందరు అప్రమత్తంగా ఉండాలని ఇంటింటికి వెళ్లి వైద్య బృందాలతో సూచనలు జారీ చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉన్నాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. డెగ్యూ, జ్వరాలు సోకిన ప్రాంతాలను ప్రత్యేకించి పర్యవేక్షిస్తున్నాం. బహిరంగ ప్రదేశాల్లో ఎవరైన పొగతాగితే ఊరుకోం. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో పరిశీలన జరుగుతుంది.

- డాక్టర్ కనకాద్రి, ఎంహెచ్‌వో

మురుగు కాలువలు అనుసంధానం చేయండి

- ఎన్ఎంసీ కమిషనర్ నందన్



ఆత్మకూరు బస్టాండ్ వద్ద పొంగుతున్న డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని రోడ్లు, రహదారులు, కూడళ్లు, నివాసాల మధ్య మురుగు నీరు బయటకు వెళ్లేందుకు కాలువలను అనుసంధానం చేయాలని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. రెండు రోజుల నుంచి వరుసగా వర్షాలు పడుతున్నందున నగరంలోని ప్రధాన ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. డ్రైనేజీ బయటకు వస్తున్నందున కాలువల్లోకి మళ్లించాలని సూచించారు. కాలువలన్నీటిల్లోనూ పూడికతీత పనులు చేపట్టాలని తెలిపారు. ట్రంకు రోడ్డు, గాంధీబొమ్మ కూడలి, కనకమహల్, కొత్తహాలు, జేమ్స్ గార్డెన్స్, వెంకటరామాపురం ప్రాంతాలలో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఎన్ఎంసీలోని ఉద్యోగులందరు యాక్సిస్ బ్యాంకుతో ఖాత ఏర్పాటు చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలను పొందాలన్నారు. ఈ మేరకు సర్కారు సదరు బ్యాంకుతో ఒప్పందం చేసుకుందన్నారు. దీపావళికి టపాసులు దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు కచ్చితంగా అనుమతులు పొందాలని తెలిపారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తూరు శ్రామికనగర్ వెంకయ్యస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు గురువారం రాత్రితో ముగిశాయి. ఉదయం విశేష పూజలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. అనంతరం స్వామివారి ఐరావతం వాహనంపై విశేష పుష్పాలంకారం, మంగళవాయిద్యాలు, బాణాసంచా వేడుకలతో నగరోత్సవం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వర్షంతో నగర ప్రజల అవస్థ



నగరంలో గురువారం కురిసిన వర్షానికి గాంధీబొమ్మ చుట్టూ చేరిన వర్షపు నీటిలో అవస్థ పడుతున్న వాహనచోదకులు



వర్షంతో బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికుల



నల్లగా కమ్ముకున్న మేఘాలు



ఆకర్షణీయంగా దీపావళి ప్రమిదలు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దివ్యకాంతుల దీపావళి పండుగ నుంచి కార్తీక మాసం వరకు ప్రతి ఒక్కరూ దీపాలు వెలిగించి తమ తమ ఇష్టదైవాలకు ఆరాధనలు చేస్తారు. ఈ క్రమంలో దీపావళి పండుగ ఏర్పాట్లపై జనం దృష్టి సారించారు. ప్రతి కుటుంబం ఈ మాసంలో ప్రమిదలలో జ్యోతులు వెలిగించాల్సిందే. అల్లా దీపాలు వెలిగించడమే దీపావళి పండుగ కళ. దీంతో ఈ సీజన్‌లో మట్టి ప్రమిదలు వ్యాపారం



జోరుగా సాగుతోంది. ఏటా దాదాపు లక్షలాది ప్రమిదలు జిల్లా ప్రజలు వినియోగిస్తారు. అందుచేత వ్యాపారాలు తమిళనాడు, కేరళ, తదితర ప్రాంతాల నుంచి వీటిని కొనుగోలు చేసి ప్రజలకు విక్రయిస్తుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో వివిధ రకాల ఆకర్షణీయమైన ప్రమిదులు దర్శనమిస్తున్నాయి. కొబ్బరికాయ, రంగురంగుల డిజైన్లు, దేవుళ్ల బొమ్మల ఆకృతిలో విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వీటి ధర రూ.150 నుంచి రూ.200 పైగా పలుకుతున్నాయి. అయినా ప్రజలు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.



భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో గురువారం పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం, సాయంత్రం విశేష నందిపూజ, ద్వితీయ, తృతీయ కాలయాగశాల పూజ, రాత సమర్పణం, విశేష హోమ ద్రవ్యాలతో హోమం, పూర్ణాహుతి, దీపారాధన, పవిత్ర సమర్పణం, ద్వితీయ కాల పవిత్ర సమర్పణం, తదనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా డాక్టర్ ఓ.గోపాలకృష్ణ, అంజనీ, మద్దిన విశ్వనాధం, భావన లక్ష్మి, తదితరులు వ్యవహరించారు.



మూలస్థానేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు సమర్పిస్తున్న వేద పండితులు

ట్రామా కేర్ ఏది?

జిల్లాలో నిత్యం ఎన్నో రోడ్డు ప్రమాదాలతోపాటు ఇతరత్రా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిల్లో తీవ్రంగా గాయపడ్డ వారికి అత్యవసర వైద్య చికిత్సలు చేయాలి. అయితే జిల్లాలో ట్రామాకేర్ (ప్రమాదాలలో గాయాలు, ప్రకృతి విపత్తులు) వైద్య చికిత్సలు ఆశించిన స్థాయిలో అందడం లేదు. ప్రభుత్వపరంగా జీజీహెచ్‌తోపాటు కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, 10 సామాజిక వైద్యశాలలు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదన్న ఆరోపణలున్నాయి.



ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది (ఫైల్)

- జిల్లాలో ఏటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య నిపుణుల కరువు
- అత్యవసర వైద్యానికి బాలారిష్టాలు
- మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది
- నేడు ప్రపంచ ట్రామా దినోత్సవం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో పలు జాతీయ రహదారులు ఉన్నాయి. వీటిపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఏటా జిల్లాలో 900లకుపైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిలో 350 మందికిపైగా మృత్యువాత పడుతుండగా 950 మంది వరకు క్షతగాత్రులుగా నమోదవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అలాంటి వారికి అత్యాయిక వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగిన ఏర్పాట్లు లేవు. నెల్లూరులోని జీజీహెచ్‌లో 2010లోనే ట్రామాకేర్ సెంటర్‌ను ప్రారంభించినా దాని లక్ష్యాలు నేటికీ పూర్తిస్థాయిలో నెరవేరలేదు. గత ఏడాది కాలంగా ట్రామాకేర్ సెంటర్ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఈ కేంద్రంలో 57 మంది వైద్యులు, సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 14 మంది స్టాఫ్‌నర్సులు, నలుగురు ఎంఎన్‌వో, నలుగురు ఎఫ్ఎన్‌వోలు మాత్రమే ఉన్నారు. వీరు కూడా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలోని క్యాజువాలిటీలోనే పనిచేస్తున్నారు. దీంతో ట్రామాకేర్ యూనిట్‌లో వైద్య సేవలు అటకెక్కాయి. ఇక ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావాలి, కందుకూరు ఏరియా ఆసుపత్రుల్లోనూ ట్రామాకేర్ సెంటర్‌లు లేక పోవటంతో అక్కడ కూడా అత్యవసర వైద్య సేవలకు తీరని విఘాతం కలుగుతోంది.

వైద్య నిపుణులు ఏరి..!

అత్యవసర పరిస్థితిలో వచ్చే రోగులలో 24 శాతం మంది ప్రమాద బాధితులేనని వైద్యులు చెబుతున్నారు. అలాంటి వారిలో 15 నుంచి 35 ఏళ్లలోపు వారే ఎక్కువగా ఉంటున్నారు. ప్రమాదాల్లో ఎక్కువ మందికి తలకు గాయాలవుతుంటాయి. అలాంటి వారిని గంటలోపు ఆసుపత్రికి చేర్చాల్సి ఉంటుంది. దీనిని గోల్డెన్ అవర్‌గా వైద్యులు చెబుతారు. ఆ సమయం లోపు తీసుకువస్తే ప్రాణాపాయం నుంచి గట్టెక్కించే అవకాశం ఎక్కువని నిపుణులు అంటున్నారు. ఇందుకోసం క్రిటికల్ కేర్ వైద్యులతో పాటు న్యూరో సర్జన్, ఆర్థోపెడిక్, కార్డియాక్, రేడియాలజీ వైద్య నిపుణులు అవసరం ఉంటుంది. అయితే జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో తగినంత మంది వైద్యనిపుణులు లేరు. నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్, న్యూరాలజీ, గుండె వైద్య నిపుణులు ఉండగా మిగిలిన ఆసుపత్రులలో ఈ స్పెషాలజిస్టులు లేరు. ఈ నేపథ్యంలో జిల్లాలో మృతుల సంఖ్య పెరుగుతున్నట్లు అంచనా.

జిల్లాలో ప్రమాదాలు ఇలా...

సంవత్సరం	రోడ్డు ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2021-22	997	466	1006
2022-23	883	494	1088
2023-24	745	354	978
2024-25	902	329	1034
2025-26	847	213	892

ట్రామాకేర్ చికిత్సలు అందిస్తున్నాం



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ట్రామాకేర్ వైద్య చికిత్సలు అందిస్తున్నాము. జీజీహెచ్‌కు రోడ్డు ప్రమాదాల బాధితులే ఎక్కువగా వస్తుంటారు. వారికి వైద్య చికిత్సలు అందిస్తున్నాము. ప్రకృతి వైపరిత్యాల బాధితులకు కూడా మెరుగైన వైద్య చికిత్సలు అందించేలా కృషి చేస్తున్నాం. ట్రామాకేర్ విభాగాన్ని మరింత మెరుగు పరిచేలా చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ కిరణ్‌కుమార్, జీజీహెచ్ ట్రామాకేర్ నోడల్ అధికారి

పారదర్శకంగా ఓటర్ల జాబితా నవీకరణ

- కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా నవీకరణ పారదర్శకంగా కొనసాగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫారం-6ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చనిపోయిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు వారి మరణ ధ్రువీకరణ పత్రాలను పొందే విధంగా వారి కుటుంబ సభ్యులను ప్రోత్సాహించాలన్నారు. రాజకీయ పార్టీల నేతలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో విజయకుమార్, టీడీపీ నుంచి రసూల్, వైసీపీ నుంచి వెంకటశేషయ్య, బీఎస్పీ నుంచి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



జీఎస్టీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ వలన రవాణా రంగంలో కలిగే ప్రయోజనాలను తెలిపే పోస్టర్లు, బ్యానర్‌లను గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన భవనంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వలన ధరలు తగ్గిన బైక్‌లు, కార్ల వివరాలను రవాణాశాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. సుమారు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ధరలు తగ్గినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ కమిషనర్ కిరణ్‌కుమార్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ చందర్, ఆర్టీవో ఎండీ మదానీ, ఎంవీఐలు మహమ్మద్ రఫీ, బాలమురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

19న జిల్లా ఆర్చరీ జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ ఆర్చరీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. సబ్‌జూనియర్ విభాగంలో 1 జనవరి 2008 తర్వాత జన్మించిన వారు, జూనియర్స్ విభాగంలో 1 జనవరి 2005 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డ్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్లు విజయవాడలోని సీతాపురం శాతవాహన కళాశాలలో నవంబరు 1 నుంచి 3వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు సంబంధిత తేదీలలో ఉదయం 8 గంటలకు ఎంపికలకు హాజరు కావాలని తెలిపారు.

శ్రీగంధం చెట్ల నరికివేత



ఉదయగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ మాసాయిపేట బీసీ కాలనీ సమీపాన గల గానుగపెంట పల్లి గ్రామానికి చెందిన రైతు నారాయణరెడ్డి తోటలో శ్రీగంధం చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. రైతు నారాయణరెడ్డి తన తోటలో శ్రీగంధం చెట్లు పెంచుతున్నాడు. బుధవారం రాత్రి రెండు శ్రీగంధం చెట్లను నరికి అందులో ఒక చెట్టు దుంగలను తీసుకెళ్లారు. దీంతో రైతు నారాయణరెడ్డి తనకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకొంటున్నాడు.

పాటలతో పోరాటం

- కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులివ్వాలి
- ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా నాట్యమండలి పాటల ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య తెలియచేశారు. గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో డప్పు కళాకారులు పెద్ద సంఖ్యలో ప్రజానాట్య మండలిలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. వివిధ కళారూపాల ద్వారా ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లటమే లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వంలో కళాకారులకు ఆశాజనక ఫలితాలు లేవని చెప్పారు. గతంలో వైఎస్సార్ కళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా గుర్తింపు కార్డులు ఇస్తే పెన్షన్ వంటి సదుపాయాలు కలుగుతాయని తెలిపారు. త్వరలో జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో పర్యటిస్తామని చెప్పారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగుల రమణయ్య మాట్లాడుతూ ప్రజా నాట్యమండలికి పూర్వ వైభవం తీసుకు వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి ప్రభాకర్, రామరాజు, నల్లారు వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య

ప్రతిభాన్వేషణకు కౌశల్ సైన్స్ పోటీలు

- ప్రతి పాఠశాల నుంచి 15 మందికి అవకాశం

నెల్లూరు(విద్య), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైన్స్ ప్రతిభాన్వేషణకు కౌశల్-2025 పోటీలు నిర్వహించనున్నారు. భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సైన్స్ క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్, రీల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. పాఠశాల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఈ పోటీలను నిర్వహిస్తారు. జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి క్విజ్‌కు తరగతికి ముగ్గురు చొప్పున 9 మంది విద్యార్థులు, పోస్టర్ ప్రజంటేషన్, రీల్స్‌కు ఇద్దరు చొప్పున ఆరు మంది విద్యార్థులు కలిపి మొత్తం 15 మంది ఒక్కో పాఠశాల నుంచి పాల్గొనే అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ బీవీఎస్‌బీవీ డాట్ ఓఆర్‌జీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా ప్రారంభమైంది. ఈనెల 24వతేదీలోగా పాఠశాలల్లో విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని అధికారులు తెలిపారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనగలిగిన ఈ పోటీలను విద్యార్థుల్లో సృజనాత్మకతను, పరిశోధనా దృక్పథాన్ని వెలికితీయడం లక్ష్యంగా నిర్వహిస్తున్నారు. 8వతరగతి విద్యార్థులకు వికసిత్ భారత్ కొరకు సుస్థిర, హరిత ఇంధన వనరులు అనే అంశంపై పోస్టర్ తయారీ, 9వతరగతి విద్యార్థులకు సత్యేంద్రనాథ్ బోస్ జీవితం, ఆయన చేసిన కృషి అనే అంశంపై పోస్టర్ తయారీ, 10వతరగతి విద్యార్థులకు ఆంధ్ర వైజ్ఞానిక వైభవం(సంప్రదాయ విజ్ఞానం, ప్రాచీన ఆధునిక శాస్త్రవేత్తలు, వైజ్ఞానిక సంస్థలు) అనే అంశంపై రెండు నిమిషాల వీడియో, షార్ట్ రీల్స్ పోటీలుంటాయి. ఈ పోటీలను పాఠశాలస్థాయిలో 8వతరగతికి నవంబరు 1, 9వతరగతికి నవంబరు 3న, 10వతరగతికి నవంబరు 4న నిర్వహిస్తారు. వీటిలో ప్రతిభ చూపిన వారికి నవంబరు 27, 28వతేదీల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించిన డిసెంబరు 1 నుంచి 5 వరకు జిల్లాస్థాయిలో నగదు బహుమతి ఇవ్వనున్నారు.



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో, ఇతర అధికారులు(ఫైల్)

విద్యార్థులను ప్రోత్సహించాలి

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణకు కౌశల్ సైన్స్ పోటీల్లో అన్నీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలి. దీనికోసంగా ఎస్‌ఈఆర్టీ నిర్దేశించిన సిలబస్‌లోని అన్నీ అంశాలను విద్యార్థులు చదువుకోవాలి. పాఠశాల స్థాయిలో విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్రస్థాయిల్లో సత్తా చాటాలి.

- డీఈవో బాలాజీరావు

నమో..జోష్



ప్రధాని సభకు ముస్లిం మహిళలు

సభకు వేలాది బస్సులు ఇలా...

మోదీతో చంద్రబాబు, పవన్

సభలో ఉప్పొంగిన దేశభక్తి

సభలో టీడీపీ మహిళా నేతలు

శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ

పొలాల వెంబడి పరుగులు

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)

విద్యార్థులకు బ్లడ్ గ్రూపు పరీక్షలు

వింజమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు బ్లడ్ గ్రూపు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ మాలకొండరావు మాట్లాడుతూ కావలి రెడ్‌క్రాస్ సొసైటీ వారు గురువారం పాఠశాలలో 735 మంది విద్యార్థులకు బ్లడ్ గ్రూపు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12186
వెండి కిలో ధర	రూ. 174000
వెండి ఒక గ్రాము	రూ. 183.00

న్యూస్ బాక్స్

రేపు చెకుముకి సైన్స్ సంబరాలు



సైన్స్ సంబరాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

ఆత్మకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం చెకుముకి సైన్స్ సంబరాలను పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నట్లు జేవీవీ నాయకులు తెలిపారు. గురువారం స్థానిక ఎల్ఆర్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కావాటి సురేష్, జెవివి నేతలు చెకుముకి సైన్స్ సంబరాలు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి నాయకుడు బంటేరు మల్లికార్జున మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలు నవంబరు 1వ తేదీన మండల స్థాయిలో, 23న జిల్లా స్థాయిలో నిర్వహించబడతాయన్నారు. తదనంతరం డిసెంబరు 12వ తేదీ నుంచి మూడురోజుల పాటు రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, జెవీవీ నాయకులు బడుగు శ్రీనివాసులు, ఎస్‌డి సాధిక్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

సంగం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనతిప్పలోని అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవంలో భాగంగా గురువారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉండే ఆకు, కూరగాయాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీడీపీవో సునీలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఊబకాయంపై...

సంగం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీయస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు ఊబకాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు సన్మానం

వింజమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జిల్లా ఉత్తమ అధికారులుగా ఎంపికైన ఎంపీడీవో కె శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ ఈవో కె రామారావును మండల సచివాలయ సెక్రటరీలు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

విద్యుత్ ఏఈగా చెంగయ్య

ఉదయగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జి విద్యుత్ ఏఈగా చెంగయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఏఈగా విధులు నిర్వహిస్తున్న ఖుద్దూస్‌బాషా తన రెగ్యులర్ స్థానమైన వరికుంటపాడుకు వెళ్లారు. వరికుంటపాడులో సబ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న చెంగయ్యను ఉదయగిరి మండల ఇన్‌చార్జి ఏఈగా ఉన్నతాధికారులు నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నిర్దేశిత ప్రదేశంలోనే టపాసులు విక్రయించాలి : ఎస్‌ఐ

వింజమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత ప్రదేశాలలో మాత్రమే బాణసంచా అమ్మకాలు జరపాలని ఎస్‌ఐ వీరప్రతాప్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ బాణసంచా విక్రయదారులు లైసెన్స్ తప్పనిసరిగా తీసుకుని విక్రయాలు జరపాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఉదయగిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈవో కార్యాలయంలో సీఆర్ ఎంటీగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఏ వెంకటేశ్వర్లును గురువారం సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు మస్తాన్‌వలి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సీఆర్ఎంటీలు, కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సులభ రీతిలో విద్యాబోధన చేయాలి

ఉదయగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభ రీతిలో విద్యాబోధన చేయాలని ఎంఈవో-1 టీ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం పట్టణంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

పల్లెల్లో సమస్యలు పట్టవా..?

● గ్రామస్థుల ఆవేదన ● పట్టించుకోని అధికారులు



వరికుంటపాడులో తుప్పు పట్టిపోతున్న బ్యాటరీ వాహనం



జీ.కొండారెడ్డిపల్లిలో వినియోగంలో లేని చెత్త నుంచి సంపద కేంద్రం



తూర్పుబోయమడగలలో మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఏళ్ల తరబడి సమస్యలు వెంటాడుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా తాగునీటి పథకాలు మొరాయించడంతో ఫ్లోరిన్ నీరే దిక్కుగా మారింది. ఎన్టీర్ సుజల స్రవంతి పథకం కింద మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో నిర్మించిన మదర్‌ప్లాంటుతో సహా ట్యాంకులు సైతం నిరుపయోగంగా మారి తుప్పు పట్టి పోతున్నాయి. అలాగే సమీప గండిపాళెంలోని రక్షిత మంచినీటి పథకం సైతం అలాగే ఉండడంతో గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. తూర్పుబోయ మడగల, జీ.కొత్తపల్లి, కొండ్రాజుపల్లి తదితర గ్రామాల్లోని చేతి పంపులు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక వెక్కిరిస్తున్నాయి. వీటితో పాటు చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలో లేకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. చెత్తను తరలించేందుకు వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి గ్రామాలకు సరఫరా చేసిన బ్యాటరీ వాహనాలు మరమ్మతులకు నోచుకోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అలాగే ఇటీవల మంజూరైన ట్రాక్టరు కూడా వరికుంటపాడులో అలంకార ప్రాయంగా మారింది. మిగిలిన గ్రామాల్లో రిక్షాలు పనికిరాకుండా పోయాయి. దీంతో రహదారుల వెంటే పేడ దిబ్బలు, చెత్తా, చెదారం పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయి.

మరుగుదొడ్లకు నోచుకోని ప్రభుత్వ కార్యాలయాలు

కాగా, పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్త్రీశక్తి భవనం, హౌసింగ్, రెవెన్యూ కార్యాలయాల ప్రాంగణాల్లో ఉన్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో అర్థాంతరంగా నిలిచిపోయినప్పటికీ నిర్మాణానికి చర్యలు చేపట్టడం లేదు. అంతేగాక జీ.కొత్తపల్లి సమీపంలోని ప్రధాన రహదారి వంతెనకు చెందిన రక్షణ గోడ కూలిపోవడంతో ప్రయాణికులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. వరికుంటపాటు, కాంచెరువు, ఇస్కపల్లి, యర్రంరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలు వెంటాడుతున్నాయి. కాగా, ఈఏడాది మండల కేంద్రంలోని బీసీ వసతిగృహాన్ని మూసివేయడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇలాంటి తరుణంలో శుక్రవారం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఎంతమేర గళం విప్పుతారో, సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడతారో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

సుప్రీంకోర్టు ఘటనపై బీఎస్పీ నిరసన



ఆత్మకూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బహుజన సమాజ్ పార్టీ నేతలు

ఆత్మకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నాన్ని ఖండిస్తూ గురువారం ఆత్మకూరు పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద దాడికి పాల్పడిన న్యాయవాది దిష్టి బొమ్మను దగ్ధం చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి కృష్ణ తదితరులు మాట్లాడుతూ న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన న్యాయవాదిని కఠినంగా శిక్షించి అతనిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు చెన్నుపల్లి రామకృష్ణ, బి శేషాద్రి, నారాయణమూర్తి, చెన్నకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



వైద్యులకు మద్దతుగా నిరసన తెలుపుతున్న క్షేత్రసాయి సిబ్బంది

డాక్టర్ల సమ్మెకు మద్దతుగా వైద్య సిబ్బంది నిరసన

సంగం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు వారి పీజీ సర్వీస్ కోటా పెంపుదల, నోషనల్ ఇంక్రిమెంట్లు, టైం బౌండ్ ప్రమోషన్ల సాధనకు చేస్తున్న సమ్మెకు మద్దతుగా స్థానిక ప్రాథమిక వైద్యశాల ఎదుట క్షేత్రస్థాయి వైద్య ఆరోగ్య సిబ్బంది నల్ల రిబ్బన్‌లు ధరించి గురువారం నిరసన తెలిపారు. అదేవిధంగా సూపర్‌వైజర్ల క్యాడర్‌ను నిర్వీర్యం చేస్తున్న 143 జీవోను వెంటనే రద్దు చేయాలి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి మల్లెం కొండయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు, స్టాఫ్ నర్సులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మసిస్టు, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.


తిరుమలాపురం పంచాయతీని విభజించొద్దు

ఉదయగిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం పంచాయతీని విభజన చేయవద్దంటూ గురువారం దుంపవారిపల్లి, గుడినరవ గ్రామస్థులు, తిరుమలాపురం ఎస్టీ కాలనీవాసులు ఎంపీడీవో బీ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పంచాయతీలో ఐదు గ్రామాలు ఉన్నాయని, తామంతా కలిసిమెలిసి ఉంటున్నామన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పంచాయతీ విభజనను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తమకు విభజన అవసరంలేదన్నారు.

రక్షిత నీటి సరఫరాకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతసాగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ అనంత సాగరంలో గత కొంత కాలంగా కొన్ని వీధులకు రంగుమారిన కలుషిత నీరు కుళాయిలకు సరఫరా జరుగుతోంది. ఈక్రమంలో ఇటీవల ఆంధ్రజ్యోతిలో రంగు మారిన నీరుతో ప్రజల అవస్థలు అనే కథనం ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఏ ఆంజనేయులు గురువారం పైప్‌లైన్ శుద్ధి చేసే పనులు చేయించారు. గతంలో వేసిన పైపుల్లో ఉన్న వ్యర్థాలు తొలగించి రక్షిత సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు.



పైపులైన్ శుద్ధి చేస్తున్న కూలీలు

జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు లబ్ధి



జీఎస్టీ కరపత్రాలను ప్రదర్శిస్తున్న అధికారులు, కూటమి నాయకులు

ఉదయగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయగిరి పట్టణంలో కావలి రవాణా శాఖ ఆధ్వర్యంలో అధికారులు, కూటమి నాయకులు అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా వారు స్థానిక పార్వతీపరమేశ్వరాలయం నుంచి మెయిన్ బజార్ మీదుగా పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ 99 రకాల వస్తువులపై ఎన్‌డీఏ ప్రభుత్వం జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి కుదించిందన్నారు. ఈ నిర్ణయంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. దీంతో అన్నివర్గాల్లో కొనుగోలు శక్తి పెరిగి దేశం ఆర్థికాభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. అనంతరం కరపత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్ర మంలో జీఎస్టీ ఉప సహాయ కమిషనర్ షేక్ షరీన, ఎంవీఐ, సహాయ ఎంవీఐ గోపినాయక్, కరుణాకరన్, ఎంపీడీవో బీ శ్రీనివాసులు, ఎస్ఐ రఘునాథ్, పీఆర్ ఏఈ శ్రీనివాసరాజు, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా, సీడీపీవో పుణ్యవతి, టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షురాలు పీ విజయలక్ష్మి, కూటమి నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహ, ఓబులరెడ్డి, సందానీ, యు.వెంకటయ్య, గాజుల బాబు, రవీంద్ర, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేకు రైతులు సహకరించాలి



భూములకు హద్దులు చూపుతున్న సర్వేయర్లు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూడో విడత రీసర్వే పనులు మండలంలోని గండిపాళెం రెవెన్యూ పరిధిలో ముమ్మరంగా సాగుతున్నాయి. గురువారం సర్వేయర్ల బృందం గ్రామానికి చేరుకొని రైతుల సమక్షంలో భూములను గుర్తించడం జరిగింది. మొత్తం 15వందల ఎకరాలు అసైన్‌మెంట్, వెయ్యి ఎకరాల సెటిల్‌మెంట్ భూములు ఉండ గా ఇంతవరకు 150 ఎకరాల్లో సర్వే నిర్వహిం చడం జరిగిందన్నారు. రికార్డుల్లో నమోదైన యజమాని పేరు, సర్వే నంబర్లు, విస్తీర్ణం సమగ్రంగా పరిశీలించి మార్పులు, చేర్పులకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తుగానే రైతులకు సమాచారం అందించి ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులు సైతం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్లు మహేష్, మోహన్, నాయబ్‌రసూల్, కొండయ్య, వీఆర్‌ఏ లింగయ్య, రైతులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షంతో ప్రజల ఇక్కట్లు

అనంతసాగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు. వీధులు జలమయమయ్యాయి. పాతదేవరా యపల్లి, లింగంగుంట, మినగల్లు తదితర గ్రామాల్లో వరికోత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈక్రమంలో వర్షంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

● ఉదయగిరి రూరల్: ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం ఏకదాటిగా వర్షం కురిసింది. రోజువారీగా పనుల మీద బయటకు వెళ్లే ప్రజలు, వ్యవసాయ కూలీలు నివాసాలకే పరిమితమయ్యారు. రహదారులు, నివాసాల సముదాయాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇక్కట్లను ఎదుర్కోవడంతో పాటు దోమల తాకిడితో జాగారం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. కాగా, పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో తాగునీటి పథకాలు సైతం మొరాయించాయి.

వర్షంతో వీధుల్లో చిత్తడి

● సంగం: మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు చిరు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో అన్ని గ్రామాల్లో వీధులన్నీ చిత్తడిగా మారాయి. వీధుల్లో వర్షపు నీరు ప్రవహించింది. దీంతో జనజీవనం స్తంభించింది.

బ్యాంకుల విలీనంతో ఖాతాదారుల అవస్థలు



ఖాతాదారులతో కిక్కిరిసిన బ్యాంకు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ బ్యాంకులను ఏకతాటిపైకి తీసుకొచ్చి సేవలను విస్తృతం చేస్తున్నామని అధికారులు చెప్పే మాటలు ఎప్పుడు పూర్తిస్థాయిలో ఆచరణలోకి వస్తాయో, ఏమోగానీ ఖాతాదారులు మాత్రం అవస్థలు పడుతున్నారు. ఇటీవల అలాంటి బ్యాంకులు విలీనమై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్పు చెందిన విషయం విదితమే. అందులో భాగంగా ఈనెల 9వ తేదీ నుంచి సాంకేతికంగా విలీనం చేసే ప్రక్రియ పుణ్యమా అని ఖాతాదారులు ఆర్థిక లావాదేవీలు జరుపుకునేందుకు రోజుల తరబడి కుస్తీలు పడుతున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతమైన ఉదయగిరి, వరికుంటపాడు మండలాల పరిధిలోని గండిపాళెం బ్యాంకులో పరిస్థితి మరీ దారుణంగా మారిం ది. సమాచారం తెలియని పల్లె ప్రజలు ఒక్కసారిగా సేవలు స్తంభించడంతో అయోమయంలో కొట్టుమిట్టాడు తున్నారు. ప్రస్తుతం ప్రతి చిన్నపాటి పనికి సైతం గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా ఆర్థిక లావాదేవీలు జరిపే తరుణంలో అవి కాస్త మొరాయించడంతో ఆరా తీసే పనిలో పడ్డారు. తీరా విషయం తెలుసుకొని బ్యాంకుకు పరుగులు తీస్తుండడంతో గురువారం ఆ బ్యాంకు ప్రాంగణం ఖాతాదారులతో కిక్కిరిసిపోయింది. అధిక సంఖ్యలో ఖాతాదారులు పరుగులు తీస్తుండడంతో సమా. దానం చెప్పే పనిలో సిబ్బంది సైతం తలలు పట్టు కుంటున్నారు. రోజంతా ఇలాంటి పరిస్థితి తలెత్త డంతో రుణాలు మంజూరు, క్రాప్ రెన్యూవల్ వంటి ఇతర పనులు నిలిచిపోతున్నాయి. ఇలాంటి పరిస్థి తుల నేపథ్యంలో గంటల తరబడి వేచి ఉండే ఓపిక నశించిన ప్రజలు చేసేదేమిలేక మౌనంగా వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. ఆప్రాంతంలో ఇతర శాఖలకు చెందిన ఎలాంటి బ్యాంకులు లేకపోవడంతో ప్రతినిత్యం ఇలాంటి పరిస్థితే కన్పిస్తోంది. అధికారులు దృష్టి సారించి సిబ్బంది, బ్యాంకు కరస్పాండెంట్ల ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పించాలని, ఇబ్బందులు లేకుండా చూడాలని ఖాతాదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

ఉరి వేసుకుని విద్యార్థి ఆత్మహత్య

● ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఘటన

కొడవలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొడవలూరు పంచాయతీ పరిధిలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లమో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు కడప జిల్లా పోరుమామిళ్ల గ్రామానికి చెందిన ఉదయ్ (17) ప్రైవేటు కళాశాలలో డిప్లమో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం కళాశాల సిబ్బంది తాళం తీయడంతో గదిలో విద్యార్థి ఉరివేసుకుని ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సురేంద్రబాబు, ఎస్ఐ కోటిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. ఇద్యార్థి మృతికి కారణాలపై విచారణ చేస్తామని సీఐ సురేంద్రబాబు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి పంచాయతీ అన్నంపల్లి గ్రామానికి చెందిన ఎగిటీల శ్రీనివాసులు తన కుమారుడు వెంకటయోగేష్ కనిపించడంలేదని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటయోగేష్ ఉదయగిరిలోని మేకపాటి వెంకురెడ్డి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన వెంకటయోగేష్ రాత్రికి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించడంతోపాటు బంధువులు, స్నేహితులను విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిస్సింగ్ కేసులపై తక్షణం స్పందించండి : ఎస్పీ



చిన్నబజారు పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలు తప్పిపోయిన కేసులలో తక్షణమే స్పందించి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాలని, ఆసలత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల హెచ్చరించారు. గురువారం ఆమె నగరంలోని చిన్నబజారు పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిధి, క్రైం చార్ట్, స్టేషన్ పరిధిలో ఉన్న నేర, శాంతిభద్రతల పరిస్థితులను పరిశీలించారు. గత మూడేళ్ల కాలంలో క్రైమ్ ఏవిధంగా ఉందో రికార్డులను తనిఖీచేసి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు చట్టాన్ని సమర్థవంతంగా అమలు పరచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్‌లు, సస్పెక్ట్‌లు, పాత నేరస్థులపై నిఘా పెంచాలని, క్రిమినల్ చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ వ్యవస్థను ముమ్మరం చేయాలని, చైన్ స్నాచింగ్ నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి శుక్రవారం మెన్ గ్రీవెన్స్ ఉంటుందని, అందరూ వినియోగించుకోవాలని తెలిపారు.

టపాసుల దుకాణాల్లో తనిఖీలు



టపాసుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా గురువారం నగరంలోని పొర్లుకట్ట ప్రాంతంలో పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపకశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో కంపెనీ టపాసులతో పాటు నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన లోకల్ మేడ్ టపాసులను గుర్తించి స్వాధీనం చేసుకు న్నారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా టపాసులను నిల్వ ఉంచిన, అమ్మకాలు జరిపినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం దుకాణాల తనిఖీ



మద్యం దుకాణంలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న ఎక్సైజ్ డీసీపీ శంకరయ్య

కావలి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యంను గుర్తించేందుకు క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి, ఆ తర్వాతనే మద్యం విక్రయాలు జరపాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం శంకరయ్య, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఏ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. గురువారం కావలి ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌ను వారు సందర్శించారు. అనంతరం పట్టణంలోని పలు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం సీసాలపై ఉన్న క్యూఆర్‌కోడ్‌లను స్కాన్ చేసి, అవి సక్రమమా? కాదా? తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించి మద్యం దుకాణదారులకు పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకే మద్యం అమ్మకాలు సాగించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావలి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుంకర శ్రీనివాసులు తనిఖీల్లో పాల్గొన్నారు.

రైల్వే క్వార్టర్స్‌లో పట్టపగలే చోరీ

● బంగారు నగల అపహరణ

కావలి రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని వడ్డిపాలెం రైల్వే క్వార్టర్స్‌లో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. ఒకటవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ట్రాక్ ఉమెన్ గా విధులు నిర్వహిస్తున్న గోళ్ల శైలజ మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి అన్నగారిపాలెం పంచాయతీలోని పూలదొరువులో బంధువుల ఇంటికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి సిమెంట్ కిటికీ పగలగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు.. బీరువా తాళం పగలగొట్టి 12 గ్రాముల బంగారు నగలు దొంగిలించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటవ పట్టణ పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 550

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థలం పరిశీలన



కందుకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం సందర్భంగా బాణ సంచా దుకాణాల ఏర్పాటుకు పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల ఆటస్థలాన్ని గురువారం సాయంత్రం వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. సబ్ కలెక్టరు హిమ వంశీ, డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ లావణ్య, సీఐ అన్వర్‌బాషా, మున్సిపల్ కమిషనర్ అనూష, ఎస్‌ఐ శివనాగరాజు, అగ్నిమాపక శాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. దుకాణాల ఏర్పాటు, విక్రయాల సమయంలో ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై సూచనలు చేశారు.

నిబంధనల మేరకే టపాసులు విక్రయించాలి

అల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల మేరకే టపాసులు విక్రయించాలని డిప్యూటీ తహసీల్దారు ప్రవీణ్ కుమార్ అన్నారు. టపాసుల విక్రయదారులతో ఆయన గురువారం తహసీల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మైదాన ప్రాంతాలలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రమాదాలు జరుగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక టపాసుల వ్యాపారులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

లింగసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా తయారీ కేంద్రాలు ఏర్పాటుచేసినా, నిల్వచేసినా, టపాసుల విక్రయానికి అంగళ్ల సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా ఏర్పాటుచేస్తే, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం నారాయణ హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ సంబంధిత ప్రభుత్వ అధికారుల నుండి లైసెన్స్ పొంది, వారు కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసి అమ్ముకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేస్తే చర్యలు తప్పవన్నారు.

లోకాయుక్త ఛైర్మన్‌ను నియమించాలి

కావలి (టౌన్) అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోకాయుక్త ఛైర్మన్‌ను వెంటనే నియమించాలని లోక్ అదాలత్ సభ్యుడు, సామాజిక కార్యకర్త ఎం మాలకొండారెడ్డి ఓ ప్రకటనలో కోరారు. అవినీతిని నియంత్రించడానికి ఏర్పాటైన లోకాయుక్త ఛైర్మన్ పోస్టు ఖాళీగా ఉండడంతో అవినీతిని అరికట్టడంలో, సత్వర న్యాయం పొందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు.

వర్షంతో రోడ్లు జలమయం

లింగసముద్రం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలో మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి పలు గ్రామాలలోని అంతర్గత రోడ్లు, వీధులు, ప్రధాన రహదారులు, ఆర్‌అండ్‌ రోడ్లు బురద మయమయ్యాయి. దీంతో వాహనదారులు, పాదచారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షం పొగనారు, జొన్నమేత పైర్లకు మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బస్సు యాత్ర

● ఏఐఎస్ఎఫ్

నెల్లూరు(విద్య), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు నిర్వహించే బస్సు జాతను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.మస్తాన్‌షరీఫ్ కోరారు. నగరంలోని రామకోటయ్యనగర్ జిల్లా కార్యాలయంలో యాత్రకు సంబంధించిన గోడపత్రికను గురువారం విడుదల చేసి మాట్లాడారు. విద్యారంగంలో ఎన్నో సమస్యలు నెలకొన్నా ప్రభుత్వం వాటిని పరిష్కరించడం లేదన్నారు. మెడికల్ కళాశాలల్లో పీపీపీ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టడంతో పాటు మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి పునః ప్రారంభించాలన్నారు. పేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే జీవో నెం 77ను రద్దు చేయాలని, విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతి మండలంలో జూనియర్ కళాశాలను, నియోజకవర్గంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ జరిగే బస్సు జాతాను విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 3వతేదీన యాత్ర జిల్లాలోకి, నగరంలోకి చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు శివంవర్మ, సోహిల్, అబ్దుల్ వికాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ భ్రష్టాండ్!

- ప్రాంగణంలోనే మూత్ర విసర్జన
- కంపుకొడుతున్న కాలువలు
- మడుగు కట్టిన వర్షపు నీరు
- అపరిశుభ్రతతో ప్రయాణికుల అవస్థ



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిల్వ ఉన్న వర్షపు నీరు



వినియోగంలో లేని మూత్ర విసర్జన శాల

కావలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కావలి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణం అపరిశుభ్రతకు అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవటంలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అపరిశుభ్రతతోనే ఎక్కువగా రోగాలు వచ్చే అవకాశాలు ఉండటంతో పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. కానీ కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో అందు కు భిన్నమైన పరిస్థితి నెలకొంది. కొద్దిపాటి వర్షం పడినా బస్టాండ్ ఆవరణంలో పడమర వైపున రోజుల తరబడి నీరు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతోంది. అయినా ప్రయాణికులు ఆ నీటి మడుగు తొక్కుకుంటూ రాకపోకలు సాగించక తప్పడంలేదు. అలాగే బస్టాండ్ ఆవరణంలో ఉన్న డ్రైనేజీ కాలువల్లో నీరు సక్రమంగా పోకుండా అక్కడ కంపు కొడుతోంది. దీంతో అక్కడ మూత్ర విసర్జన చేయకూడదని ఆర్టీసీ అధికారులు బోర్డు పెట్టారు. అయితే మూత్ర విసర్జనకు నూతనంగా నిర్మించిన మూత్రవిసర్జనశాల నిర్మాణం పూర్తి అయినా దానిని వినియోగించకుండా అడ్డుగా కంప వేశారు. దీంతో ప్రయాణికులు మూత్రవిసర్జన ఆరుబయట డ్రైనేజీ కాలువ వద్దనే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆ ప్రాంతమంతా కంపు కొడుతోంది. దీని వలన రోగాలు వచ్చే ప్రమాదాలు కూడా ఉన్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి నూతనంగా నిర్మించిన మూత్రవిసర్జన శాలను ప్రారంభించి ఆరుబయట మూత్ర విసర్జన చేయకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అలాగే డ్రైనేజీ నిల్వ లేకుండా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండకుండా ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జీఎస్టీ తగ్గింపు పేదలకు వరం

అవగాహన ర్యాలీలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న జీఎస్టీ కావలి అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్ రావు

కావలి, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణ పేద, మధ్యతరగతి వర్గాలకు ఓ వరమని జీఎస్టీ కావలి అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్‌రావు తెలిపారు. సూపర్ జీఎస్టీ-సూపర్‌సేవింగ్స్‌పై కావలి రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం పట్టణంలో మోటారు సైకిళ్లు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో కావలి డీఎస్పీ పీ. శ్రీధర్ ర్యాలీని ప్రారంభించారు. అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, ట్రాక్టర్లు, వాటి విడి భాగాలకు తగ్గిన జీఎస్టీ వల్ల రూ.10 వేల నుంచి 1.5 లక్షల వరకు లబ్ధి చేకూరుతోందన్నారు. వాహనాలకే కాకుండా అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించినందున ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. దీంతో రాష్ట్రానికి రూ.8 వేల కోట్ల రాబడి తగ్గిపోతున్నా, ముఖ్యమంత్రి చంద్రబాబు జీఎస్టీ సం స్కరణలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి రవాణాశాఖ అధికారి మురళీధర్, మో టారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందర రావు, కావలి మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, కావలి ఏఎంసీ ఛైర్మన్ పోతు గంటి అలేఖ్య, టీడీపీ పట్టణ ప్రధాన కా ర్యదర్శి జ్యోతి బాబూరావు, బీజేపీ నాయ కుడు వీవీ రంగా రెడ్డి పాల్గొన్నారు.



కందుకూరులో ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టరు హిమవంశీ, అధికారులు

● కందుకూరులో ర్యాలీ

కందుకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కందుకూరు ఆర్టీవో టీఎస్ లక్ష్మి నేతృత్వంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం కందుకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం నుంచి ర్యాలీని సబ్ కలెక్టరు దామెర హిమవంశీ ప్రారం భించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న జీఎస్టీ నాలుగు శ్లాబుల విధానాన్ని రద్దుచేసి రెండు శ్లాబులకు పరిమితం చేయటం వలన రైతులు, సామాన్య ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ అన్వర్‌బాషా, పట్టణ ఎస్ఐ శివనాగరాజు, ఎంవీఐ జె. అనిల్‌కుమార్, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ యానాది, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టుమనేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నవంబరు 3న సమ్మె



కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మిక నాయకులు

కావలి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నవంబరు 3న సమ్మె చేస్తున్నామని గురువారం యూనియన్ నాయకులు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఏఐటీయూసీ అనుబంధ సంస్థ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎండ్లూరి ఆదినారాయణ, మల్లె అంకయ్య, సీపీఐ నాయకుడు దమ్ము దర్గాబాబు కార్మికుల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. 12వ పీఆర్సీని ప్రకటించి, మధ్యంతర భృతిని 30 శాతం ఇవ్వాలన్నారు. గత రెండేళ్లలో విధి నిర్వహణలో మరణించిన, పదవీ విరమణ చేసిన కార్మికుల కుటుంబ సభ్యులను, దినసరి వేతన కార్మికులను ఔట్‌సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలన్నారు. బకాయిలు సత్వరమే చెల్లించి, పట్టణ జనాభాకు తగినట్లు కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు.

మేఘన కుటుంబానికి అండగా ఉంటాం

కలిగిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కలిగిరి- కొండాపురం మార్గంలో తెల్లపాడుక్రాస్ రోడ్డువద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులతోపాటు సోదరిని కోల్పోయిన చదలవాడ మేఘన కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బోర్‌వెల్ లారీ కింద పడి తీవ్రంగా గాయపడిన మేఘనకు అత్యవరస చికిత్స అందించాలని ఎమ్మెల్యే కిమ్స్ వైద్యాధికారులకు సూచించారు. మృతుల కుటుంబానికి అండగా నిలవాలని మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డితోపాటు తూర్పు దూబగుంట టీడీపీ నాయకులు పిచ్చపాటి చలపతిరెడ్డి, హజరత్‌రెడ్డి, మాలకొండారెడ్డి, పవన్‌కళ్యాణ్, శివరామయ్య తదితరులకు సూచించారు. బాధితకుటుంబ సభ్యులకు కాకర్ల ఛారిటబుల్ ట్రస్టు తరఫున టీడీపీ నాయకులు తూర్పు దూబగుంటలో రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు.



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

అవినీతి రహితంగా రీసర్వే చేయాలి

అల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామంలో చేపడుతున్న రీసర్వే ప్రక్రియను అవినీతి రహితంగా చేపట్టాలని రైతులు స్పష్టం చేశారు. గురువారం అల్లూరు మండలం సింగపేట సచివాయంలో అధికారులను స్థానిక రైతులు ఈ మేరకు నిలదీశారు. స్థానిక రీసర్వే అధికారులు అవినీతికి పాల్పడడం సరికాదని వారు ఆరోపించారు. రీసర్వే చేపట్టాల్సిన భూముల రైతులకు సరైన సమయం తెలియజేయడం లేదన్నారు. అధికారులు వచ్చే సమయాన్ని ముందుగా తెలియజేస్తే అందుబాటులో ఉండేందుకు అవకాశం ఉంటుందని రైతులు అన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

లింగసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవా లని ఐసిడిఎస్ పెదపవని సెక్టార్ సూపర్‌వైజర్ ఏవి రాధాదేవి సూచించారు. గురువారం మండలం లోని పెదపవని-1 అంగన్వాడీ కేంద్రంలో పోషకా హార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందించే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేసిన ముళ్లచెట్లు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



వలేటివారిపాలెం : మంగళపాలెంకు వెళ్లే రోడ్డును కమ్మేసిన ముళ్లచెట్లు

వలేటివారిపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని మంగళపాలెంకు వెళ్లే ప్రధాన రహదారిని ముళ్లచెట్లు కమ్మేశాయి. దీంతో వాహనదారులు రాకపోకల సమయాలలో నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. రోడ్డును ముళ్లచెట్లు కమ్మేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు పక్కకు వైదొలిగే సమయంలో ముళ్లచెట్లు తగిలి ప్రయాణికులకు గాయాలవుతున్నాయని, అంతేగాకుండా ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లచెట్లను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

శిథిలావస్థలో పాఠశాలల భవనాలు

● పొంచి ఉన్న ప్రమాదాలు



వలేటివారిపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుకుపాలెం, గాంధీనగర్, మాలకొండ, పెదఅమ్మపాలెం గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉండడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. శిథిల భవనాలు ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. విద్యార్థులు పాఠశాల విరామ సమయంలో శిథిల భవనాలలో ఆడుకుంటుంటారు. అలాంటి సమయంలో భవనాలు కూలిపోతే ఘోర ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వర్షాకాలంలో శిథిల భవనాల్లోని గోడల్లోకి వర్షం నీరు చేరి కూలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత విద్యాశాఖాధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే శిథిల భవనాలను కూల్చివేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



యువతరంగం

ఎస్వీయూలో 'యువతరంగ్- 2025' కార్యక్రమం ఉత్సాహంగా మొదలైంది. కళలు, చిత్రలేఖనం, సాంస్కృతిక.. తదితర 30 అంశాలపై పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

6

● వానెల్లూరు భూ అక్రమాల్లో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నాటి తహసీల్దార్, సిబ్బందిపై వేటు

సత్యవేడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం వానెల్లూరు రెవెన్యూలో అటవీ భూములకు పట్టాలు సృష్టించి అక్రమాలకు పాల్పడిన అప్పటి తహసీల్దార్, సిబ్బందిపై వేటు పడింది. వారిని సస్పెండు చేస్తూ రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది అక్రమార్కులతో కుమ్మక్కై వానెల్లూరు రెవెన్యూ పరిధిలో సుమారు 300 ఎకరాలకు నకిలీ పట్టాలు సృష్టించారు. ఈ భూ కుంభకోణంపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 8వ తేదీన 'రెవెన్యూలో మాయాజాలం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్.. బాధ్యులైన అధికారులు, సిబ్బంది, అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జేసీని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ రాజశేఖర్ ఈనెల 10వ తేదీన సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ మురళి కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా అప్పటి తహసీల్దార్ రామాంజనేయులు (ప్రస్తుతం కర్నూలు జిల్లా దేవరకొండలో పనిచేస్తున్నారు), ఆర్ఐ సురేష్, వీఆర్వోలు రాఘవేంద్ర, భార్గవ్ (ప్రస్తుతం పాకాల మండలం చెన్నుగారిపల్లెలో విధులు), అతడి భార్య తేజశ్వి, విలేజ్ సర్వేయర్ వెంకటేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, సచివాలయ సిబ్బంది పూర్ణచంద్ర తోపాటు పట్టాలు పొందిన పి.శ్రీధరన్, అమృతవర్షిణి, నవీన్ రాజ్‌ఖన్నా, అనురాధ జయకుమార్, లతజయ్‌కుమార్, ఆశాసురేష్, పట్టాల సృష్టికి ఆధార్ కార్డులు సమర్పించిన మల్లీశ్వరి, బత్తెమ్మ పేర్ల మీద ఐపీసీ 120ఏబీ, 420, 466, 467 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదే విధంగా రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా అప్పటి తహసీల్దార్ రామాంజనేయులు, ఆర్ఐ సురేష్, వీఆర్వోలు రాఘవేంద్ర, భార్గవ్, సచివాలయ అగ్రికల్చర్ ఎంపీఈవో పూర్ణచంద్ర నాయుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అడ్డదారులతో అంధకారంలోకి...

వానెల్లూరు భూ కుంభకోణంలో సస్పెండైన ఆరుగురు రెవెన్యూ ఉద్యోగుల్లో నలుగురు సచివాలయ సిబ్బంది కావడం గమనార్హం. గత ప్రభుత్వంలో సచివాలయ రెవెన్యూ సిబ్బందిగా విధుల్లో చేరిన వీరు. కేవలం నాలుగు సంవత్సరాల కాలంలోనే అవినీతిలో పట్టాలు పొందే స్థాయికి చేరడం విశేషం. ఉద్యోగపరంగా వీరికి ఎంతో భవిష్యత్తు ఉన్నా అడ్డదారులు తొక్కి తమ విలువైన భవిష్యత్తును చేజేతులా అంధకారంలోకి జారవిడుచుకున్నారు.

● రాజస్థాన్ ఘటనతో అధికారులు మేల్కోవాలి
● ప్రమాణాలు, నిబంధనలపై దృష్టి పెట్టాలి

స్లీపర్ బస్సుల్లో భద్రత ఎంత?



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్లీపర్ ఏసీ బస్సుల్లో భద్రత ఎంత? రవాణా శాఖ ప్రామాణికాలు, నిబంధనలు ఎంత వరకు పాటిస్తున్నారు? అసలు విద్యుత్ కనెక్షన్లు, వైర్లు ఎంతవరకు సేఫ్టీగా ఉన్నాయి? రాజస్థాన్ ఉదంతంతో తలెత్తుతున్న ప్రశ్నలివి. మంగళవారం రాజస్థాన్‌లో ఏసీ స్లీపర్ బస్సులో మంటలు వ్యాపించడంతో కనీసం 20 మంది మరణించారు. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని భావిస్తున్నారు. దీంతో మన బస్సుల భద్రతపైనా అధికారులు మరింతగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఇటు బస్సుల నిర్వాహకులు, అటు అధికారులపై ఉంది. కొన్ని బస్సుల్లో ఫైర్ ఫైటింగ్ వ్యవస్థ ఎలా పనిచేస్తోందనే విషయాన్ని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. అంతకుమించి వీటిపై ప్రయాణికులకూ అవగాహన లేకపోవడం వారికి కలిసివస్తోంది. తిరుపతి ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో ఇక్కడ నుంచి విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు, కాకినాడ, హైదరాబాదు, చెన్నై వంటి నగరాలకు రోజుకు 15 నుంచి 20 ఏసీ స్లీపర్ ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు నడుపుతున్నారు. ఇక బెంగళూరు నుంచి తిరుపతి మీదుగా వెళ్ళే బస్సులు దాదాపు 30 వరకు ఉన్నాయి.

ఇలా చేయాలి..

● స్లీపర్ ఏసీ బస్సుల్లో రెండు డోర్లు ఉండాలి. ఏదైనా ప్రమాదం జరిగినపుడు వెంటనే ప్రయాణికులు బయటకు వచ్చేలా ఎగ్జిట్ డోర్ సిస్టమ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

● ప్రతి ఐదు సీట్లకు ఒక సుత్తిని ఉంచాలి. లేకుంటే సైడ్ అద్దాలు పగులకొట్టడం అసాధ్యమని అధికారులు చెబుతున్నారు.

● బస్సుల్లో వైర్లు, ఏసీ, ఇంజన్ సామర్థ్యం పరిశీలించుకోవాలి. ఆరు నెలలకోసారి ఎలక్ట్రికల్, ఏసీ మెకానిక్, అగ్నిమాపక శాఖ సిబ్బంది ద్వారా తనిఖీలు చేయించుకోవాలి. ఏవైనా లోటుపాట్లుంటే సరిదిద్దాల్సిన బాధ్యత ట్రాన్స్‌పోర్టు యాజమానులపై ఉంది. బస్సుల్లో పాత వైర్లుంటే మార్చాలి.

● బస్సుల్లో అంతర్గత కండిషన్ వ్యవస్థపై నిఘా ఉంచాలి.

అప్రమత్తత.. అందరి బాధ్యత



ఏసీ స్లీపర్ బస్సు డ్రైవర్లు గంటకు 120 నుంచి 140 కిలోమీటర్ల వేగంలో వెళ్తుంటే.. ప్రయాణికులు అడ్డు చెప్పాలి. ప్రతి బస్సుకు ఎడమ, కుడి వైపుల్లో కనీసం రెండు ఎమర్జెన్సీ డోర్లుంటే అనుకోని ప్రమాదం జరిగితే దిగిపోవడానికి అవకాశాలుంటాయి. హాల్టింగ్ పాయింట్ల వద్ద ఎలక్ట్రిక్ మెకానిక్‌లు బస్సులను తనిఖీలు చేసి షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఫైర్ ఫైటింగ్ వ్యవస్థపై ప్రయాణికులకూ అవగాహన కల్పించాల్సిన బాధ్యత డ్రైవర్లకు ఉండాలి. మేమూ వారానికోసారి తనిఖీలు చేసి అవగాహన కల్పిస్తున్నాం.

- మురళీమోహన్, డీటీవో, తిరుపతి

నేరం ఒప్పుకో?

● ఆ ఇద్దరు టీడీపీ నేతలు చేయించారని చెప్పు
● 'అంబేడ్కర్' ఘటనపై పోలీసులు కొట్టి.. బెదిరించారన్న అరుణ్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరు టీడీపీ నేతల ప్రోద్బలంతో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టానని చెప్పాలంటూ పోలీసులు కొట్టారని బాధితుడు అరుణ్ ఆరోపించారు. గురువారం తిరుపతి రుయాస్పత్రిలో ఆయన చికిత్స పొందారు. వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనకు సంబంధించి వైసీపీకి చెందిన బొమ్మయ్యపల్లె సర్పంచి గోవిందయ్యను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో వైసీపీ నాయకులు కాకుండా టీడీపీ వారే చేయించారని పోలీసులు బెదిరించారంటూ దేవళంపేటవాసి అరుణ్ చెబుతున్నారు. 'ఈనెల 13వ తేది పోలీసులు వచ్చి నన్ను ఎస్ఐ పిలుస్తున్నారంటూ ఆటోలో ఎక్కించుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారు. టీడీపీ నేతలు సతీష్ నాయుడు, కిషన్‌చందు మందుపోయించి అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టించారని చెప్పాలన్నారు. వాళ్లు చెప్పడంతో మరో ఇద్దరితో కలిసి చెరువు మార్గంలో వచ్చి నిప్పు పెట్టి వెళ్లినట్లు ఒప్పుకోవాలని కొట్టారు. మద్యం తాగించి బలవంతంగా చెప్పించడానికి ప్రయత్నించారు. స్టేషన్‌లో కాళ్లకు గొలుసులువేసి బంధించి చిత్రహింసలు పెట్టారు. బోర్లా పడుకోబెట్టి వీపుపై, చేతులు, కాళ్లపై కొట్టారు. పోలీసుల లాఠీ చార్జి దెబ్బలకు శరీరమంతా కమిలిపోయింది' అంటూ కొందరు మీడియా ప్రతినిధుల వద్ద దేవళంపేటకు చెందిన అరుణ్ ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం మధ్యాహ్నం 11.51 గంటలకు చికిత్స నిమిత్తం ఆయన తిరుపతి రుయాస్పత్రిలోని అత్యవసర విభాగంలో చేరారు. పోలీసులు కొట్టడంతో గాయాలైనట్లు డాక్టర్లకు చెప్పారు. ఇతడిని పరీక్షించిన వైద్యులు శరీరంపై దెబ్బలు బలంగా ఉన్నాయని, నోరు, ముక్కు నుంచి నెత్తురు కారుతోందని ధ్రువీకరించారు. మెడికో లీగల్ కేసు కింద ఆస్పత్రిలో రిజిస్టర్ చేసి వెదురుకుప్పం పోలీసులకు సమాచారం అందించారు. కాగా, మధ్యాహ్నం తర్వాత ఆస్పత్రి నుంచి ఆయన స్వచ్ఛందంగా డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లారు.



చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి వచ్చిన అరుణ్

ఎందుకా అత్యుత్సాహం?

అంబేడ్కర్ విగ్రహ ఘటన కేసును కార్వేటినగరం సీఐ దర్యాప్తు చేస్తున్నారు.కర్నూలులో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు సీఐ, ఎస్ఐ, కొందరు సిబ్బంది వెళ్లారు. ఈ క్రమంలో ఇద్దరు పోలీసులు 13వ తేది అరుణ్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చి కొట్టారని, బుధవారం వదిలిపెట్టినట్లు బాధితుడి మాటలను బట్టి తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ కేసులో.. అధికార టీడీపీ నేతలను ఇరికించేలా,వారి పేర్లు చెప్పాలంటూ ఆ పార్టీ కార్యకర్తను ఇలా హింసించడం వెనుక వీరి అత్యుత్సాహం ఏమిటి? అధికారులు లేనప్పుడు ఇంత ధైర్యంగా ఈ పని చేశారంటే.. వాళ్లకంత దన్ను ఇచ్చిన వాళ్లెవరు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

'ఆక్వా'కు రాయితీ విద్యుత్తు

● రిజిస్ట్రేషన్ చేసుకుంటే యూనిట్ ఒకటిన్నర రూపాయికే

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆక్వారంగానికి చేయూతనిచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాయితీతో విద్యుత్తు సరఫరాకు ఓకే చేసింది. ఆక్వా సాగుకు విద్యుత్ బిల్లులు యూనిట్‌కు రూ.3.80 చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో యూనిట్ రూ.1.50 విద్యుత్ పథకాన్ని తీసుకొచ్చింది. దీనికోసం నిర్వాహకులు మత్స్యశాఖ అధికారుల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జిల్లాలో సముద్ర తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న కోట, వాకాడు, చిల్లకూరు, చిట్టమూరు మండలాల్లో 9,446 ఎకరాల్లో చేపలు, రొయ్యలు పెంచుతున్నారు. ఇక్కడ ప్రాసెసింగ్ ప్లాంట్ల నుంచి సుమారు 1200 టన్నుల ఆక్వా ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. ఏటా సుమారు రూ.700కోట్ల వ్యాపారం జరుగుతోంది. కరెంటు ఛార్జీలు భారంగా మారుతున్నట్లు ఆక్వా సాగుదారులు విన్నవించారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు యూనిట్ రాయితీ విద్యుత్తును ప్రవేశ పెట్టారు.



ఆక్వా రైతులూ రిజిస్ట్రేషన్ చేసుకోండి



జిల్లాలో 2,500మందికిపైగా రైతులు ఆక్వా సాగుచేస్తున్నారు. యూనిట్ విద్యుత్ రూ.1.50 కి పొందాలంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దీనికోసం ఆయా సచివాలయాల పరిధిలోని మత్స్యశాఖ సహాయకుల వద్దకు ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్తే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేస్తారు. క్షేత్రస్థాయిలోనూ ధ్రువీకరించుకుంటాం. ఆ తర్వాత రాయితీ విద్యుత్తుకు అర్హులవుతారు.

- రాజేష్, జిల్లా మత్స్యశాఖ అధికారి

విస్తారంగా వరి సాగు



విజయపురం మండలంలో వరిసాగు విస్తారంగా సాగు చేస్తున్నారు.సకాలంలో మంచి వర్షాలు కురవడంతో ఎక్కువ మంది రైతులు వరిసాగు వైపు దృష్టి సారించారు. మాధవరం, కళియంబాకం, పన్నూరు, బూచివానత్తం, జగన్నాథపురం, విజయపురం, కాళికాపురం, జీఎంపురం, కేవీపురం ప్రాంతాల్లో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. కూలీలు అందుబాటులో లేకపోవడంతో ఎక్కువ మంది రైతులు వరినాటకు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు.

- విజయపురం, ఆంధ్రజ్యోతి

శబరిమల యాత్రకు ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కేరళలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమల యాత్రకు ప్రత్యేక ప్యాకేజీ టూర్(హైర్ టూర్ బస్సులు)ను ప్రవేశపెట్టినట్లు ఏపీ పర్యాటకాభివృద్ధి డీవీఎం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 36 సీట్ల నాన్ ఏసీ హైటెక్, 45సీట్ల ఏసీ ఓల్వో బస్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 08772289123, 9848007033, 9848802099, 9848973985 లను సంప్రదించాలని కోరారు.

టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షల షెడ్యూల్ విడుదల

తిరుపతి(విద్య), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ - 2026 పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి గురువారం ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 4న షార్ట్‌హ్యాండ్ పరీక్ష జరుగనుంది. 24, 25 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. హాజరుకాగోరు విద్యార్థులు తమ సమీపంలోని టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించి, పరీక్ష రుసుం చెల్లించాలని సూచించింది. ఇతర వివరాలకు రాష్ట్ర సాంకేతిక విద్యామండలి అధికార వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.



వేదికపై జడ్పీ చైర్మన్, సీఈవో, వైస్‌చైర్మన్

ఎన్ని సమావేశాల్లో చెప్పినా

సమస్యలు పరిష్కరించరా?

● అధికారుల తీరుపై జడ్పీటీసీల ధ్వజం ● జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి రాకపోవడంపై ఆగ్రహం ● కోరం లేకుండానే మూడోస్థాయి సంఘ సమావేశం

చిత్తూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి సమావేశంలో తాము సమస్యలు చెప్తున్నా అవి పరిష్కారం కావడం లేదని అధికారుల తీరుపై జడ్పీటీసీ సభ్యులు అసహనాన్ని వ్యక్తం చేశారు.చిత్తూరు జడ్పీ సమావేశ మందిరంలో గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. సభ్యులు వారివారి మండలాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులను నిలదీయడంతోనే సమావేశం ముగిసింది. కోరం లేకుండా మూడో స్థాయి సమావేశాన్ని నిర్వహించారనే విమర్శలు వచ్చాయి. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టడంపై కూడా సభ్యులు చర్చించారు. ఏదో ఒక సాకు చెప్పి జిల్లా స్థాయి అధికారులు సమావేశాలకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులును సభ్యులు కోరారు.జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, జడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, 5వ స్థాయి సంఘ చైర్‌పర్సన్ భారతి తదితరులు పాల్గొన్నారు.

● గ్రామాల్లో విద్యుత్ అంతరాయం తీవ్రంగా ఉందంటూ ఎస్ఈ దృష్టికి సభ్యులు తీసుకొచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్లకోసం రైతులు నెలల తరబడి వేచివుండాల్సి వస్తోందనగా ఈ సమస్యలను పరిష్కరిస్తామని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ హామీ ఇచ్చారు.

● కొత్త పింఛన్లు ఇవ్వకపోవడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు, బెడ్ రిడెన్, పెరాలసిస్ పేషెంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సదుం జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి డీఆర్‌డీఏ అధికారులను నిలదీశారు. ఉపాధి హామీ పనులకు బిల్లులు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు.చిత్తూరు జిల్లాలో మార్చి 31వ తేది వరకు బిల్లులు అప్‌లోడ్ చేసే అవకాశం ఇస్తే తిరుపతి జిల్లాలో మాత్రం మార్చి 6వ తేదికే నిలిపివేశారని వాపోయారు.

● పీలేరులో యాభైకి పైగా ఆస్పత్రులుంటే కొత్తగా నిర్మించిన అశ్విని ఆస్పత్రిలోనే తనిఖీలు చేసి మూసివేశారంటూ వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై జడ్పీటీసీ రత్నశేఖర్ ధ్వజమెత్తారు.దీంతో వెంటనే ఆస్పత్రిని తెరిపించాలని అధికారులకు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు.

● ఆవులు, భూమి లేనోళ్లకు కూడా గోకులం షెడ్లు మంజూరు చేశారని ఎర్రావారిపాళ్యం జడ్పీటీసీ కరుణాకర రెడ్డి డ్వామా అధికారులను నిలదీశారు.

● పాలసముద్రం మండలంలో జగనన్న కాలనీ ఏర్పాటుకు ఖర్చు చేసిన డబ్బులు ఇంకా ఇవ్వకుండా హౌసింగ్ అధికారులు సతాయిస్తున్నారని జడ్పీటీసీ అన్నలగన్ వాపోయారు. ● వైద్య శాఖలో ఎన్‌హెచ్ఎం కింద విడుదల చేసిన నోటిఫికేషన్‌కు అనుమతి వుందా అని గుడుపల్లె జడ్పీటీసీ కృష్ణమూర్తి అడగ్గా కలెక్టర్ అనుమతితోనే నోటిఫికేషన్ ఇచ్చామని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెప్పారు.



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు



'కే-ర్యాంప్' పద్ధతైన సినిమా

తిరుమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 'కే-ర్యాంప్' చాలా పద్ధతైన సినిమా అని, ఫ్యామిలీతో కలిసి చూడవచ్చని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. ఆ చిత్ర దర్శకుడు జైన్స్ నానితో కలిసి గురువారం తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అక్టోబరు 18న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చామన్నారు. కాగా 'చెన్నై లవ్ స్టోరీ' అనే చిత్రంతో పాటు మరో రెండు ప్రాజెక్టులు కూడా చేస్తున్నట్టు వెల్లడించారు.

కిరణ్ అబ్బవరం, జైన్స్ నాని

శ్రీవారి సేవలో ప్రముఖులు





గుమ్మనూరు జయరాం - శంకర్ గౌడ్, కిరణ్‌రాయల్

తిరుమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, హైదరాబాద్ హిమాయత్‌నగర్ టీటీడీ ఎల్‌ఏసీ ఛైర్మన్ శంకర్ గౌడ్, తిరుపతి జనసేన ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్ ఉన్నారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించండి

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పించాలని దక్షిణ మధ్యరైల్వే గుంతకల్లు డివిజన్ అదనపు డివిజన్ మేనేజరు యు.సుధాకర్ ఆదేశించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ ఆధునికీకరణ పనులు జరుగుతున్న సమయంలో ప్రయాణికులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకొని వసతులు పెంచాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. డీఈఈ వీరయ్య, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, ఎస్ఎస్ఈలు సిద్దారెడ్డి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.79 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,919

తలనీలాలు సమర్పించినవారు: 28,218



యువతే మన దేశ సంపద



ఎస్వీయూ ఏడీ భవనం ముందు కళా ప్రదర్శనగా వస్తున్న విద్యార్థులు



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న సినీ నటుడు కిరణ్ అబ్బవరం

- 'యువతరంగ్' ప్రారంభోత్సవంలో ఎస్వీయూ వీసీ
- ఆకట్టుకున్న ర్యాలీ, కళా ప్రదర్శనలు



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్వీయూ వీసీ నరసింగరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యువతే మన దేశానికి నిజమైన సంపద అని ఎస్వీ యూనివర్సిటీ వీసీ టి.నరసింగరావు పేర్కొన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే 'యువతరంగ్-2025' గురువారం ప్రారంభమైంది. శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన ప్రారంభ సభలో వీసీ మాట్లాడారు. కళలు మనిషిని మానవీయంగా మారుస్తాయని అభిప్రాయపడ్డారు. తనకు వ్యక్తిగతంగా కళలు, సంగీతం పట్ల ఆసక్తి ఉన్నా, సాధన చేయడం సాధ్యం కాలేదని తెలిపారు. ప్రస్తుతం వీలైన మేరకు సంగీతాన్ని సాధన చేస్తున్నట్లు చెప్పారు. యువత ఏదో ఒక కళలో ప్రావీణ్యం సంపాదించాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు సూచించారు. యూనివర్సిటీ విద్యార్థులను అద్భుతమైన క్రీడాకారులుగా, కళాకారులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు సూచించారు. యూనివర్సిటీ పరిధిలో కళలకు సంబంధించిన ప్రత్యేక కోర్సులు ఏర్పాటు చేయాలని కోరారు.



ఈ కార్యక్రమంలో కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్ ప్రొఫెసర్ చెంద్రాయుడు, ఆర్ట్స్ కామర్స్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాళ్ళు సుధారాణి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో- ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ ఉదయ్, రాజశేఖర్, ప్రసన్న, స్వరూప్, అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ ప్రాంతాల కళాకారులు పాల్గొన్నారు. అంతకుముందు అన్నమయ్య భవన్ నుంచి శ్రీనివాసా ఆడిటోరియం దాకా కళాబృందాలు, విద్యార్థులు ర్యాలీగా వెళ్లారు.



ప్రత్యేక ఆకర్షణగా కిరణ్ అబ్బవరం

యువతరంగ్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నటుడు కిరణ్ అబ్బవరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో తానెంతో ఉత్తేజం పొందానని చెప్పారు. తనకు వచ్చిన గుర్తింపునకు యువత ముఖ్య కారణమన్నారు. తనకు పాతికేళ్ల వయసులో జీవిత లక్ష్యం అర్థమైందని, సినిమా రంగంలో కళాకారుడిగా రాణిస్తాననే నమ్మకం పెరిగిందని గుర్తుచేసుకున్నారు.

రసవత్తరంగా పోటీలు

గురువారం మధ్యాహ్నం నుంచి మూడు సమాంతర వేదికలపై చేపట్టిన సాంస్కృతిక పోటీలు రసవత్తరంగా సాగాయి. సుమారు 30 అంశాలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, కళా బృందాలు ప్రదర్శనలు ఇచ్చారు. విజేతలకు ముగింపు సభలో బహుమతులు ప్రదానం చేయనున్నారు.



వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భార్యకు నిప్పంటించిన భర్త

చంద్రగిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తు. ఆపై గొడవ. దీంతో భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు వెంకటేష్. ఈ ఘటన చంద్రగిరి మండలం తొండవాడ పంచాయతీ పరిధిలోని ఉగ్రప్రత్యంగిరాదేవి ఆలయం సమీపంలోని నిమ్మతోటలో మంగళవారం రాత్రి జరిగింది. వెంకటేష్, హరిత దంపతులది సదుం మండలం. తొండవాడ సమీపంలోని వెంకటకృష్ణ నిమ్మతోటకు ఎనిమిదేళ్లుగా కాపలాదారులుగా ఉంటున్నారు. మంగళవారం రాత్రి భార్యభర్తలు మద్యం తాగారు. ఆపై వారి మధ్య గొడవ జరగడంతో అక్కడే ఉన్న పెట్రోల్‌ను భార్యపై పోసి నిప్పటించాడు. ఆమె కేకలు వేస్తుండగా, వెంకటేష్ రోడ్డుపైకి వచ్చి జరిగిన విషయాన్ని స్థానికులు చెప్పాడు. ఆమెను 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబరు 18నుంచి
యంగ్ బర్డర్ శిబిరం

ఏర్పేడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పక్షులు,పర్యావరణంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ఐసర్, షోలా స్కై ఐలాండ్స్ సంయుక్తంగా ఓ శిబిరం నిర్వహించనున్నాయి. యంగ్ బర్డర్ పేరిట డిసెంబరు 18 నుంచి 22 వరకు ఐసర్ ప్రాంగణంలో శిబిరం నిర్వహించనున్నారు. 14 నుంచి 18 ఏళ్ల ఔత్సాహిక విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చునని ఐసర్ అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నవంబరు 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 20 మందిని ఎంపిక చేయనున్నారు. పర్యావరణం,పక్షుల పట్ల ఆసక్తి, ప్రకృతిపై అనురక్తి పెంపొందించేందుకు ఈ శిబిరం దోహదపడుతుందన్నారు. దరఖాస్తుతో పాటు మర్ని వివరాలకు స్కైలాండ్.ఇన్./వైబీసీ25.హెచ్‌టీఎంఎల్‌ను చూడాలని సూచించారు.

తిరుపతి- సికింద్రాబాద్ మధ్య
నేడు, రేపు ప్రత్యేక ఏసీ రైళ్లు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని శుక్ర, శనివారాల్లో తిరుపతి- సికింద్రాబాద్ మధ్య ఏసీ ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైలు (09497) తిరుపతిలో శుక్రవారం బయలుదేరి గూడూరు, తెనాలి, నడికుడి, నల్లగొండ మీదుగా మరుసటి రోజు సికింద్రాబాదుకు చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైలు (09498) సికింద్రాబాదులో బయలుదేరి బేగంపేట, వికారాబాదు, రాయచూర్, ఆదోని, గుంతకల్లు, కడప, మీదుగా తిరుపతికి మరుసటి రోజు చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైలుకు పూర్తిగా 3 ఏసీ పెట్టెలు ఉంటాయి.

ఒంటరి ఏనుగు బీభత్సం



పాతపేట వద్ద సిమెంటు దిమ్మెను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు

కల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాతపేట వద్ద బుధవారం రాత్రి ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి బుధవారం రాత్రి బయలుదేరిన ఒంటరి ఏనుగు పాతపాళ్యం అటవీ మార్గంలో పాతపేట వద్దకు చేరుకుంది. పాతపేట రోడ్డుకు ఇరువైపులా ఉపాధి పథకంలో నాటిన రాగి చెట్లను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. అక్కడి నుంచి సదుం-కల్లూరు రోడ్డు వద్దకు చేరుకున్న ఒంటరి ఏనుగు రోడ్డు పక్కనున్న సిమెంటు దిమ్మెను ధ్వంసం చేసింది. సదుం-కల్లూరు రోడ్డును దాటుకున్న ఒంటరి ఏనుగు ఇటీవల చెరువుకట్టపై నుంచి జారిపడి ఏనుగు మృతి చెందిన ప్రాంతానికి చేరుకొని రైతు గుర్రప్పకు చెందిన వరిపంటను ధ్వంసం చేసింది. అక్కడి నుంచి ఒంటరి ఏనుగు బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీ ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకొని అక్కడి రైతులు గోపి, ఆంజనేయులుకు చెందిన వరి పంటను ధ్వంసం చేసింది. సమీపంలో ఉన్న పశుగ్రాసాన్ని తినేసింది. అక్కడి నుంచి వచ్చిన దారిలోనే అడవిలోకి తిరుగుముఖం పట్టింది. మార్గంలోని పలువురు రైతుల పంటలను ధ్వంసం చేసుకుంటూ పశ్చిమ విభాగం అడవిలోకి చేరుకుంది. గురువారం పగలంతా అడవిలోని గోగులమ్మ వంక వద్ద ఒంటరి ఏనుగు సంచరించినట్లు ప్రజలు తెలిపారు.

పారిశ్రామికంగా చిల్లకూరు అభివృద్ధి

- సుమారు రూ.4500 కోట్లతో పనులు
- రెండేళ్లలో అభివృద్ధి పనులు పూర్తి



సాగర్‌మాల రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

చిల్లకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం త్వరలోనే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని తద్వారా ఎంతో మందికి ఉపాధి కలుగుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం మండలంలో జరుగుతున్న సాగరమాల, క్రిస్‌సిటీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారులను కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానం చేస్తూ సుమారు రూ. 3వేల కోట్లతో సాగరమాల రోడ్లు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వరగలి క్రాస్‌రోడ్డు నుంచి 35 కిలోమీటర్లు, నాయుడుపేట నుంచి 36 కిలోమీటర్లు, ముత్తుకూరు నుంచి 19 కిలోమీటర్లు వరకు సాగరమాల రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. సాగరమాల రోడ్డు నిర్మాణ పనుల్లో భూసమస్యలు, మైనింగ్, ఇరిగేషన్ వంటి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామన్నారు. నాయుడుపేట నుంచి కృష్ణపట్నంపోర్టు సౌత్‌గేట్ వరకు నిర్మిస్తున్న సాగరమాల రోడ్డు పనులను 2027 జూన్ కల్లా పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ రోడ్లు కృష్ణపట్నపోర్టుకు అనుసంధానం చేయడం ద్వారా మండలంలో ఎక్కువశాతం పరిశ్రమలు రానున్నాయన్నారు. అదేవిధంగా తమ్మినపట్నంలో 2500 ఎకరాల్లో క్రిస్‌సిటీ పారిశ్రామకవాడను ఏర్పాటు చేయనున్నామన్నారు. క్రిస్‌సిటీలో 1200 కోట్లు రూపాయల పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం రూ.200 కోట్లు అభివృద్ధిపనులు జరుగుతున్నాయ న్నారు. వచ్చే ఏడాది డిసెంబరు కల్లా క్రిస్‌సిటీలో రూ.1200 కోట్లు అభివృద్ధిపనులు పూర్తవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో చైన్ చోరీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో చైన్ చోరీ చేసిన ఘటన గురువారం నగరంలోని బెస్తవీధిలో చోటు చేసుకుంది. వెస్ట్ సీఐ మురళీమోహన్ వివరాల మేరకు.. బెస్తవీధికి చెందిన మనోహరమ్మ చెల్లెలు మనవడు అఖిల్‌ను రెండేళ్ల క్రితం కొందరు హత్య చేశారు. తాజాగా నిందితుడు తాను అఖిల్ స్నేహితుడినని చెప్పి ఇంటి వద్ద ఉన్న మనోహరమ్మ వద్దకు వచ్చి మెడలో ఉన్న 16 గ్రాముల బంగారు చైను లాక్కుని పారిపోయాడు. ఆమె గట్టిగా చైన్‌ను పట్టుకోవడంతో సవరం బంగారు ఉండిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): స్థానిక రుయా ఆసుపత్రిలో ఇటీవల తొలగించిన 50 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఉప కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులను నూతనంగా కాంట్రాక్టు తీసుకున్న వారు తొలగించడం భావ్యం కాదన్నారు. వారం రోజులుగా కార్మికులు ఆసుపత్రి ప్రాంగణంలో నిరసన తెలుపుతున్నా అధికారులు జోక్యం చేసుకోక పోవడం అన్యాయమన్నారు. కార్మిక శాఖ అధికారులు జోక్యం చేసుకుని వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, బుజ్జి, చినబాబు, జి.బాలసుబ్రమణ్యం, లక్ష్మమ్మ, బి.రాణి, పి.రామమూర్తి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్‌గా గాలి పుష్పలత



తిరుపతి(విద్య), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్‌గా బీజేపీ సీనియర్ నాయకురాలు తిరుపతికి చెందిన డాక్టర్ గాలి పుష్పలత నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకముంచి రాష్ట్ర మీడియా పానలిస్ట్‌గా బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు, తన నియామకం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు.

✦ వైకుంఠ ద్వార దర్శనం
రెండు రోజులే కల్పించండి

- టీటీడీ ఈవోకు శ్రీనివాసానంద సరస్వతి వినతి



తిరుపతి(కల్చరల్), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వైకుంఠ ద్వార దర్శనాన్ని రెండు రోజులే కల్పించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి విన్నవించారు. ఆ మేరకు గురువారం ఆయన వినతిపత్రం సమర్పించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పది రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారని గుర్తుచేశారు. కేవలం ధనార్జనను దృష్టిలో ఉంచుకుని ఈ నూతన విధానానికి నాడు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. పూర్వపు ఆచారాల ప్రకారం రెండు రోజులు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలన్నారు.

టీటీడీ రవాణా విభాగంలో ఘనంగా ఆయుధపూజ



శ్రీవారి నమూనా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తున్న అధికారులు

తిరుమల, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): టీటీడీ రవాణా విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. తిరుపతిలోని వర్క్‌షాప్‌లో ఉదయం, సాయంత్రం తిరుమల డిపోలో నిర్వహించారు. ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, డీఎం లక్ష్మీప్రసన్న, డీఐలు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు. టీటీడీ రవాణా విభాగంలోని వాహనాలకు పుష్పాలంకరణ చేసి, తోరణాలు కట్టి ఆయుధపూజ నిర్వహించారు. శ్రీవారి నమూనా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, ప్రసాదాలు పంపిణీ చేశారు.

టిప్పర్ ఢీకొని సర్వేయర్ దుర్మరణం



సర్వేయర్ సునీత (ఫైల్‌ఫొటో)

నాగలాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని మండల సర్వేయర్ మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... మండల సర్వేయర్ సునీత (35), సురుటుపల్లి సచివాలయ సర్వేయర్ దినేష్‌లు గురువారం సాయంత్రం సురుటుపల్లిలో ఓ స్థలాన్ని సర్వే చేశారు. అనంతరం దినేష్ ద్విచక్రవాహనంపై ఈమె నాగలాపురానికి బయలుదేరారు. బయటకొడియంబేడు వద్ద వెనుక వస్తున్న ఒక టిప్పర్ లారీ అధిగమించే క్రమంలో వీరి ద్విచక్ర వాహన స్టీరింగ్‌ను తాకింది. దీంతో ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దినేష్, సునీతలు చెరోవైపు పడిపోయారు. లారీ చక్రం ఈమె తల భాగం మీదుగా వెళ్లడంతో సునీత సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచింది. దినేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఆమె మృతదేహాన్ని సత్యవేడు వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడిని నాగలాపురం పీహెచ్‌సీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త వెంకటేశులు టీటీడీలో ఏఈగా పనిచేస్తున్నారు. వీరికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వృద్ధుడికి డెంగ్యూ

రేణిగుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ సీఆర్‌నగర్ కాలనీలో ఈశ్వరయ్య అనే వృద్ధుడు డెంగ్యూ భారినపడ్డాడు. పంచాయతీ సిబ్బంది ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు చేపట్టారు. బ్లీచింగ్ చల్లి, నీటి ట్యాంకులను శుద్ధి చేశారు.

సూపర్ జీఎస్టీ 2.0 తగ్గింపును సద్వినియోగం చేసుకోండి



జీఎస్టీపై అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న జేటీసీ కృష్ణవేణి, టీడీపీ మురళీమోహన్ తదితరులు

- జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణవేణి

తిరుపతి(రవాణా), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ 2.0తగ్గింపు ద్వారా కలిగే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని రవాణాశాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (జేటీసీ) కృష్ణవేణి పిలుపునిచ్చారు. దీనిపై రవాణాశాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో చేపట్టిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలో వాహనాల కొనుగోలుపై జీఎస్టీ రేటు తగ్గింపుతో ప్రజలకు కలిగే ఆదాపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. కొనుగోలుదారులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేలా తిరుపతి రవాణాశాఖ కార్యాలయంలో వాహన డీలర్లతో స్టాళ్లను ఏర్పాటు చేశామని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ చెప్పారు. ఆటోమొబైల్ రంగంలో నూతనంగా వచ్చిన వాహనాలను ప్రజలకు చూశారు. జీఎస్టీపై ఫిర్యాదు చేయదలుచుకుంటే టోల్‌ఫ్రీ నెంబరు 1915కు సమాచారం ఇవ్వాలని జీఎస్టీ అధికారులు రాజ్యలక్ష్మి, నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మోహన్‌కుమార్, రమణనాయక్, ఆంజనేయ ప్రసాద్, స్వర్ణలత, పరిపాలన అధికారులు, విజయప్రశాంతి, విజయకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రవాణాశాఖ కార్యాలయంలో వాహనాల స్టాల్స్‌ను ఏర్పాటుచేసిన దృశ్యం

సాగరమాల పనుల పరిశీలన

కోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని సాగరమాల ప్యాకేజీ-4 రోడ్డు పనులను గురువారం కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. నాయుడుపేట, కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే సాగరమాల ప్యాకేజీ-4 రోడ్డు పనులు 31 కిలోమీటర్ల వరకు జరుగుతున్నాయి. రూ.1200 కోట్ల వ్యయంతో చేపట్టిన పనుల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అక్కడ నుంచి నేరుగా కనుపూరు మీదుగా కోటకు చేరుకొని అక్కడ నుంచి గూడూరు వైపు వెళ్లారు. ఆయన వెంట గూడూరు ఇన్‌చార్జి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు జయజయరావు, సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో శ్రీనివాసులు, సాగరమాల రోడ్డు ఇంజనీర్లు ఉన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచేందుకే చెకుముకి పోటీలు

గూడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సైన్స్‌పట్ల అవగాహన పెంపొందించేందుకు జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ పరీక్షల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన పాఠశాల స్థాయిలో, నవంబరు 1వ తేదీన మండలస్థాయిలో పోటీలను నిర్వహిస్తామని వివరించారు. మండలస్థాయిలో ఎంపికైన వారు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. నాగరాజు, చెంచునారాయణ, రజనీకాంత్, ఇబ్రహీం, శ్రీనివాసాచారి, సురేష్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలను సాధించాలి

చిల్లకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్‌ఎం అనసూయ అన్నారు. గురువారం మండలంలోని పారిచెర్లవారి పాళెం జడ్పీఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శెనగ మస్తానయ్య సహకారంతో ఇంగ్లీష్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతలు అందిస్తున్న ప్రోత్సాహాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, మాధవయ్య, శ్రీనివాసులు, ప్రజేంద్రరెడ్డి, సుగుణ, నాగభూషణమ్మ, మధుసూదన్‌రావు, విద్యుల్లత, కామేశ్వరి, రవీంద్ర పాల్గొన్నారు.





శ్రీకాళహస్తి ఆర్డీవోకు అదనపు బాధ్యతలు

గూడూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గూడూరు డివిజన్ ఇన్‌చార్జి ఆర్డీవోగా శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాఘవేంద్రమీనా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో భానుప్రకాష్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం



కోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కోటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురు వారం డీఎస్సీ ద్వారా ఎంపికైన ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులకు అభినంద సభ జరిగింది. కొక్కుపాడు, కోట బాలికల ఉన్నత పాఠశాల, పెదగోవిందపల్లి ఉన్నత పాఠశాల, కోట ఎస్సీ రెసిడెన్షియల్, చిట్టెడు ఎస్సీ రెసిడెన్షియల్ వ్యాయామ ఉపాధ్యాయులు డీఎస్సీ ద్వారా పోస్టులు పొందారు. ఈ క్రమంలో వీరిని ఎంఈవో మస్తానయ్య, హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, బాలికల గురుకుల ప్రిన్సిపాల్ రజనీ, ఫిజికల్ డైరెక్టర్లు రాజ్‌కుమార్, రమణయ్య, ధనంజయ, సంధానిబాషా, వలీ అహ్మద్, సుభాన్, కరీముల్లా, శ్రీనివాసులు, కార్తీక్‌లు అభినందించారు.

యూరియా కార్డుల పంపిణీ

వాకాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపురం పంచాయతీలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న యూరియా కార్డులను టీడీపీ నాయకుడు తుమ్మల మోహన్‌నాయుడు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మల మోహన్‌నాయుడు మాట్లాడుతూ ఈ కార్డులతో రైతు సేవా కేంద్రాలలోనూ, ప్రైవేట్ షాపులలోనూ యూరియాను పొందవచ్చన్నారు. రైతులు నానో యూరియా, నానో డీఏపీ ఎంచుకొని తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని వివరించారు.

చట్టాలు అమలు చేయాలి

గూడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కార్మికచట్టాలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరామ్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డీఎం లక్ష్మికి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో పనిచేస్తున్న స్వీపర్లు, వివిధరకాల కార్మికులకు వేతనాలను సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మల్లికార్జున, కేఎస్‌వాసులు, రఘురామయ్య, బీవీరమణయ్య పాల్గొన్నారు.

సుప్రీం న్యాయమూర్తిపై దాడి గర్హనీయం: కాంగ్రెస్



నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీ చింతామోహన్

గూడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై జరిగిన దాడిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. గురువారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. హర్యానా రాష్ట్రంలో ఎస్సీ డీజీపీ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. వైసీపీ, టీడీపీ ప్రభుత్వాల్లో ఎస్సీ విద్యార్థులకు రావాల్సిన ఉపకారవేతనాలు అందడంలేదన్నారు. జీఎస్టీ తగ్గించడం వలన సామాన్యులకు ఎటువంటి ఉపయోగంలేదని కేవలం ఉన్నత వర్గాల వారికి మాత్రమే లాభం చేకూరుతుందన్నారు. దుగరాజపట్నం పోర్టును నిర్మిస్తే ఈ ప్రాంతంలో లక్షలాదిమందికి ఉద్యోగ అవకాశాలు వచ్చేవన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారావు, చిరంజీవి పాల్గొన్నారు.

ఆంధ్రుల ఆరాధ్యదైవం ఎన్టీఆర్

- ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజలో ఎమ్మెల్యే విజయశ్రీ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల

నాయుడుపేట టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రుల ఆరాధ్యదైవం స్వర్గీయ నందమూరి తారకరామారావు అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని సీఎస్ తేజా సెంటర్ కూడలి వద్ద మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహ ఏర్పాటుకు గురువారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నేత కొండేపాటి గంగాప్రసాద్ సహాయ సహకారాలతో ఈ విగ్రహ ఏర్పాటును చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ కుమార్, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, సుధాకర్‌రెడ్డి, నెలవల రాజేష్, ఆదవరం నాగూరయ్య, పసల గంగాప్రసాద్, పొట్లపూడి రాజేష్, పాదర్తి ప్రకాష్ నాయుడు, గాలి రాజేష్‌నాయుడు, నిత్యకృష్ణారెడ్డి, గూడూరు ప్రభావతమ్మ, ఈతముక్కల వెంకట సుబ్బానాయుడు, రవిబాబు, లక్ష్మయ్య, సుబ్బారావు, రవి, నారాయణ, సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, మాధవనాయుడు, చెంగయ్య, శివయ్య, సంచి కృష్ణయ్య, అత్తికాయల సుబ్రహ్మణ్యం, విజయకుమార్‌నాయుడు, మాజీ ఎంపీపీ కన్నెమ్మ, దార్ల రాజేంద్ర పాల్గొన్నారు.

తల్లికి వందనం అందించాలని కలెక్టర్‌కు వినతి



చిల్లకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం అందించాలని గురువారం మండలంలోని తిక్కవరం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, స్థానికులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. తిక్కవరం ఉన్నత పాఠశాలలో చదువుతున్న 302 మంది విద్యార్థులకు తల్లివందనం నగదు తల్లిదండ్రుల ఖాతాలలో జమకాలేదని రాజశేఖర్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో జనవరిలోపు తల్లికివందనం వచ్చేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఉడతావారిపార్లపల్లి వద్ద సాగరమాల రోడ్డుపై ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలని కలెక్టర్‌ను స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో జానకిరామిరెడ్డి, సుప్రజ, కుమార్‌యాదవ్, మునిశేఖర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, మురళీరెడ్డి తదితరులు ఉన్నారు.

రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే ఏఎంసీ చైర్మన్ రమేష్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ కిషోర్ టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీలో రూ.2 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గురువారం శంకుస్థాపన చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఆర్‌అండ్‌బి బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే మున్సిపాలిటీ అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైయిన్‌లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, టీడీపీ నాయకులు అలవల శ్రీనివాసులు, తిరుమలరావు, వై.సతీష్, సురేష్ నాయుడు, బొమ్మన్ పళణి, వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.







చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.59.79 లక్షలు

సూళ్లూరుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ హుండీ ఆదాయాన్ని గురువారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. మొత్తం 102 రోజులకుగాను అమ్మవారికి కానుకల రూపంలో 59,79,520 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషన్ ప్రసన్న లక్ష్మి తెలిపారు. ఇవి కాకుండా బంగారం 0.48 గ్రాములు, వెండి 0.69 గ్రాములు, విదేశీ కరెన్సీ యుఎస్‌ఏ డాలర్స్ 185, సింగపూర్ డాలర్ 15, యుఏఈ ధీరామ్స్ 30, సౌదీ రియాల్స్ 15, నేపాల్ రూపాయి 10 హుండీ కానుకల రూపంలో ఆదాయం చేకూరింది. గూడూరు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బాబ, సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మి పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

పెళ్లకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలతో అనేక మంది పేదలకు ఉచిత వైద్యం అందుతుందని పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి, బంగారం పేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బంగారంపేట గ్రామంలో నెల్లూరు నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ నివిత, ప్రశాంత్, పీఆర్వో నందకిశోర్ ఉన్నారు.

ఏరియా ఆస్పత్రికి ఇన్వర్టర్ వితరణ


ఏరియా ఆసుపత్రికి ఇన్వర్టర్ అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రికి ప్రగతి సేవాసంస్థ, శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం ఇన్వర్టర్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కటివేటి చంద్రశేఖర్, మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన ఇన్వర్టర్‌ను అందించామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా, డాక్టర్ ప్రసూన, మురళీనాయుడు, ప్రభాకర్, రాము, నాగరాజు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్: స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో గురువారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధి ఆర్‌వీరావు, సుధాకర్, శ్రీనివాస్, గోపీనాథ్‌రెడ్డి, ప్రసాద్, మురళీనాయుడు, గురునాథం పాల్గొన్నారు.

కార్మికుడికి గాయాలు

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి గ్రామం లో ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమలో పనిచేస్తున్న వలస కార్మికుడు మోహన్‌దాస్ కుడికాలిపైకి గురువారం క్రేన్ దూసుకెళ్లింది. గాయపడిన అతడిని పరిశ్రమ యజమాన్యం నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నై తరలించారు.







